ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

మంగళవారం 1 ఏప్రిల్ 2025

భక్తిశ్రద్ధలతో రంజాన్

పవిత్ర రంజాన్ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లావ్యాప్తంగా మసీదులు, ఈద్గాలలో ఉదయం నుంచే ఐదుపూటలా ప్రార్థనలు చేశారు. ఇందుకోసం అధికార యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లు చేయగా, పోలీసులు భద్రత కల్పించారు. ఇక అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా పాల్గొని దువా చేసి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



నెల్లూరు : బారాషహీద్ దర్గాలో ముస్లింలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఇమామ్ సయ్యద్ అబూబకర్ అష్రఫీ సాబిరి, చిత్రంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్ తదితరులు



సీతారామపురం ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

5.5 లక్షల ఎకరాల్లో రెండో పంట!

- 'సోమశిల' కింద 3.50 లక్షల ఎకరాలు
- 'కండలేరు' పరిధిలో 2 లక్షల ఎకరాలు
- ప్రతిపాదనలు తయారు చేసిన అధికారులు
- పది రోజుల్లో ఐఏబీ నిర్వహణకు సన్నాహాలు

నెల్లూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల తర్వాత జిల్లాలో ఎడగారు సాగు పూర్తిస్థాయిలో జరగనుంది. గతేడాది పుష్కలంగా వర్షాలు కురవడం, ముందు జాగ్రత్తతో శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను రప్పించడంతో ఈదఫా సాగుకు ఢోకా లేకుండా పోయింది. గతేడాది ఎడగారు ఊసే లేకపోగా ఈ దఫా సాగుకు అవకాశమున్న నేపథ్యంలో రైతాంగం సంతోషిస్తోంది. ఏప్రిల్ రెండో వారం నుంచి రెండో పంటకు సంబంధించి నీటిని విడుదల చేసేందుకు అధికారులు ప్రాథమికంగా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం సోమశిల, కండలేరు జలాశయాల్లో ఉన్న నీటి లభ్యత ఆధారంగా ఎడగారు దాదాపు ఐదున్నర లక్షల ఎకరాలకుపైగా సాగునీటి కేటాయింపులు జరపాలని ప్రతిపాదించారు. సోమశిలలో ప్రస్తుతం 53 టీఎంసీల నీరు ఉంది. డెడ్ స్టోరేజీ, ఇతర అవసరాలకు పోగా మిగిలే నీటితో సుమారు 3.50 లక్షల ఎకరాలకు నీరు అందించవచ్చని భావిస్తున్నారు. పెన్నా డెల్టా కింద ఉన్న మొత్తం ఆయకట్టుకు నీరు ఇచ్చేలా ప్రాథమి కంగా నిర్ణయించారు. అలానే కండలేరు జలాశయం కింద 49 టీఎంసీలు నిల్వ ఉండగా, డెడ్ స్టోరేజీ, తాగునీటి అవసరాలకు పోను మిగిలిన నీటితో సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు ఇచ్చేలా ప్రతిపాదిస్తున్నారు. దీనిని బట్టి చూస్తే ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో రానున్న ఎడగారు ఐదు లక్షల ఎకరా ల్లో కచ్చితంగా సాగు కానుందని స్పష్టమవుతోంది. సాధారణం గా ఒక టీఎంసీ నీటితో పది వేల ఎకరాలను పండించవచ్చు. అయితే వేసవి కాలం కావడంతో నీటి ఆవిరి ఎక్కువగా ఉంటుందన్న కారణంతో ఒక టీఎంసీతో 8500-9000 ఎకరాలు పండించేలా ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. ప్రాజెక్టుల కింద ఉన్న హక్కుల ప్రకారం ఏ కాలువ కింద ఎంత ఆయకట్టు మేర సాగుకు నీటి కేటాయింపులు జరపాలన్నదానిపై కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రతిపాదనలన్నీ సాగునీటి సలహా మండలి(ఐఏబీ) ముందు ఉంచనున్నారు. ఐఏబీ నిర్వహణకు సంబంధించి ఇరిగేషన్ అధికారులు ఇప్పటికే మంత్రులు, కలెక్టర్ ఆనంద్‌తో చర్చించారు. మరో పది రోజుల్లోపు ఐఏబీ నిర్వహించాలని మంత్రులు ప్రాథమికంగా నిర్ణయించారు. ఎమ్మెల్యేలందరితో మాట్లాడాక వారి వీలునుబట్టి ఒక తేదీని నిర్ణయించి ఐఏబీ సమావేశాన్ని పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పటికే వరి కోతలు 90 శాతం వరకూ పూర్తయ్యాయి. మరోవారంలో కోతలు పూర్తికానున్నాయి. దీంతో ఐఏబీ నిర్వహించిన వెంటనే రెండో పంటకు నీటి విడుదల మొదలుపెట్టేలా ఇరిగేషన్ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.



● ముగిసిన ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు

నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలో 2024-25 ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లు సోమవారం అర్ధరాత్రి ముగిశాయి. మంగళవారం మధ్యాహ్నం 1 గంట తర్వాత రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుందని జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఇప్పటిదాకా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 74వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం 3916 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నట్లు ఆయన తెలిపారు.

సెలవులోనూ 111 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్!

నెల్లూరు (హరనాథపురం), మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ సందర్భంగా సోమవారం సెలవు దినమైనా జిల్లావ్యాప్తంగా 111 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరిగాయి. రిజిస్ట్రేషన్ శాఖకు రూ.42.73 లక్షల ఆదాయం వచ్చింది. నెల్లూరులోని ప్రధాన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 11 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరిగాయి.

గందరగోళంగా ఈకేవైసీ

- రేషన్‌కార్డుదారుల్లో అవగాహనారాహిత్యం
- చేయాల్సింది 2.4 లక్షలు.. చేసింది 1.4 లక్షలే
- చేతులెత్తేసిన పౌరసరఫరాల శాఖ
- ఈనెలాఖరు వరకే గడువు పొడిగింపు
- ఇప్పటికైనా అధికారుల్లో చలనం వచ్చేనా!?

నెల్లూరు (హరనాథపురం), మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రేషన్‌కార్డుదారుల ఈకేవైసీ ప్రక్రియ గందరగోళంగా మారింది. ఈకేవైసీ చేయించుకోవాని కార్డుదారుల్లో అవగాహన కల్పించాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో 2.4 లక్షల మంది ఈకేవైసీ



చేయించుకోని కార్డుదారులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరందరి చేత మార్చి నెలాఖరులోగా ఈకేవైసీ చేయించాల్సి ఉంది. గడువు ముగిసినా లక్ష్యాన్ని మాత్రం (1.4 లక్షల మందికి పూర్తి) అధికారులు పూర్తి చేయలేకపోయారు. రాష్ట్ర ప్రభుత్వం గడువు పొడిగించకుండా ఉంటే సుమారు లక్ష మందికిపైగా రేషన్ పొందే అవకాశాన్ని కోల్పోయి ఉండేవారు. పౌరసరఫరాల శాఖలో డీఎస్‌ఓ, ఏఎస్‌ఓ, సీఎస్‌డీటీలు తదితర అధికారులు ఉన్నారు. వీరంతా ప్రాంతాల వారీగా డీలర్లను అప్రమత్తం చేసి ఈకేవైసీ చేయించాలని ఒత్తిడి చేయలేకపోయారు. దీంతో లక్షలాది మంది కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోలేకపోయారు.

● సచివాలయాల్లో ఏదీ!?

రేషన్‌కార్డులో పేరు ఉండి ఐదేళ్లు దాటిన పిల్లలకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలి. ఐదేళ్లు దాటినా పిల్లలకు బయోమెట్రిక్ పడకపోతే ఆధార్ సెంటర్‌లో అప్‌డేట్ చేయించుకోవాలి. అనంతరం డీలర్ లాగిన్‌లో ఈకేవైసీ చేయించాలి. సచివాలయాలు లేదా రేషన్ డీలర్ వద్ద ఈకేవైసీ చేయించుకోవచ్చని చెప్పిన అధికారులు, ఆ దిశగా వారు చేస్తున్నారో లేదో పరిశీలించలేదు. దీంతో సచివాలయానికి కార్డుదారులు వెళ్లినా సిబ్బంది, రేషన్ షాపులో డీలర్ అందుబాటులో ఉండకపోవడంతో చాలా మంది ఈకేవైసీ చేయించుకోలేకపోయారు. జిల్లాలో 7.35 లక్షల రేషన్ కార్డులు ఉండగా, ఒక కుటుంబంలో నలుగురికి తగ్గకుండా సభ్యులు ఉన్నారు. వీరందరి చేత గడువులోపు ఈకేవైసీ చేయించలేకపోయారు. అయితే, ప్రభుత్వం ఏప్రిల్ 30 వరకు పొడిగించడంతో కార్డుదారులకు ఊరట కలిగించినట్లు అయ్యింది. ఇప్పటికైనా పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించి రేషన్ కార్డులోని ప్రతి ఒక్కరు ఈకేవైసీ చేయించుకునేలా చర్యలు చేపట్టాలి.

'కాకాణి'కి మరో నోటీసు

- హైదరాబాద్‌కు వెళ్లిన నెల్లూరు పోలీసులు
- ఇంట్లో బంధువుకు అందజేసిన మనుబోలు ఎస్‌ఐ
- నేడు విచారణకు రావాలన్న పోలీసులు
- ముందస్తు బెయిల్‌పై నేడు కోర్టులో విచారణ
- ఏం జరగబోతుందోనని వైసీపీ వర్గాల్లో ఉత్కంఠ



హైదరాబాద్‌లోని కాకాణి నివాసంలో ఆయన బంధువుకు నోటీసు ఇస్తున్న ఎస్‌ఐ రాకేష్

నెల్లూరు (క్రైం), మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఉంటున్న వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసానికి సోమవా రం జిల్లా పోలీసులు నోటీసులు అందజేశారు. 30వ తేదీన (ఆది వారం) నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న కాకాణి నివాసానికి వెళ్లిన పోలీసులు అక్కడ కాకాణి లేకపోవడంతో గోడకు నోటీసులు అంతికించిన సంగతి తెలిసిందే. క్వార్ట్జ్ కేసుకు సంబంధించి సోమవారం నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరుకావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. అయితే, సోమవారం మధ్యాహ్నం 12 గంటలు దాటినా కాకాణి విచారణకు హాజరు కాలేదు. ఇది ముందుగానే ఊహించిన జిల్లా పోలీసులు సోమవారం హైదరాబాద్‌లోని కాకాణి నివాసం వద్దకు చేరుకొని రెండవ నోటీసును అందజేసేందుకు ప్రయత్నించారు. అయితే ఆయన ఇంట్లో లేకపోవడంతో కాకాణి బంధువులు వేణుంబాక సుమంత్‌రెడ్డికి మనుబోలు ఎస్‌ఐ రాకేష్ నోటీసులు అందజేశారు. మంగళవారం ఉదయం రూరల్ డీఎస్పీ కార్యాలయంలో జరిగే విచారణకు రావాలని నోటీసులో పేర్కొన్నారు. రెండుసార్లు కాకాణి గోవర్ధన్‌రెడ్డి నోటీసులు తీసుకోకపోవడం, ముందస్తు బెయిల్‌పై నేడు విచారణ జరుగుతుండటం ఆసక్తిగా మారింది. ఈ నేపథ్యంలో మంగళవారం కాకాణి పోలీసుల విచారణకు హాజరవుతారా!? రెండుసార్లు నోటీసులు ఇచ్చినా తీసుకోక పోవడం, సమాధానం ఇవ్వకపోవడంతో పోలీసులు అరెస్ట్ చేస్తారా!? లేదా కోర్టు నుంచి ముందస్తు బెయిల్ వస్తుందా!? అన్నది వేచి చూడాలి. మరో వైపు క్వార్ట్జ్ కేసులో కాకాణి గోవర్ధన్‌రెడ్డి చుట్టూ ఉచ్చు బిగుసుకుంటుండటంతో వైసీపీ నాయకులు, కార్యకర్తల్లో కలవరం మొదలైంది.

నీలకంఠేశ్వరుడి మాన్యంలో

మళ్లీ దొంగలు

- రాత్రుళ్లు యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు
- చూస్తూ ఉండిపోతున్న దేవదాయ శాఖ

ఉలవపాడు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం ఉలవపాడులోని నీలకంఠేశ్వర స్వామి ఆలయ భూముల్లో మళ్లీ గుట్టుచప్పుడుగా మైనింగ్ దోపిడీ జరుగుతోంది. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలోని శానంపూడి గ్రామం కొండుబీడులో సర్వే నెం.519లోని 30.05 ఎకరాల దేవుడి మాన్యం ఉంది. సదరు భూముల్లో సుమా రు 20 ఎకరాల్లో రూ.10 కోట్ల విలువైన గ్రావెల్ స్టోన్ కొల్లగొట్టినట్టు సమాచారం. గతేడాది జూలై లో దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఆగమేఘా ల మీద ఆలయ ఈవోలు జానకమ్మ, ప్రసాదులపై సస్పెన్షన్ వేటు వేశారు. దీంతో గ్రావెల్ స్టోన్ దోపిడీ ఆగినా కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి శానంపూడి గ్రామానికి చెంది న అధికార పార్టీ నాయకుడు ఆలయ భూముల్లో ఎర్రమట్టి, గ్రావెల్ విస్తృతంగా తవ్వుతున్నట్టు సమాచారం.

● ఉన్నతాధికారులకు ముడుపులు...

దేవుడి మాన్యంలో గ్రావెల్ దందా జరుగుతోందని, ఆలయానికి చెందాల్సిన ఆదాయం అక్రమార్కుల జేబుల్లోకి వెళుతోందని గతేడాది అప్పటి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి రాష్ట్ర ఎండోమెంట్ మంత్రికి రాతపూర్వక ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి దేవదాయశాఖ ఏసీ, డీసీ ఉన్నతాధికారులు ఆలయ భూములను పరిశీలించి, చర్యలు తీసుకున్నారు. తిరిగి అదే దోపిడీ యథేచ్ఛగా గ్రావెల్ స్టోన్ అక్రమ రవాణా చేశాడంటే ఉన్నతాధికారులకు భారీగా ముడుపు ముట్టాయని అదే శాఖకు చెందిన వారే ఆరోపిస్తున్నారు. గ్రావెల్ దందా ముఠాకి ఉలవపాడు ఎండోమెం ట్ కార్యాలయంలో ఒక చిరుద్యోగికి సత్సంబం ధాలు ఉండటం, ఉన్నతాధికారులకు సదరు దోపిడీ ముఠా నుంచి భారీగా లంచాలు ఇప్పించారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో దిద్దు బాటు చర్యల్లో భాగంగా క్షేత్రస్థాయి లో ఈవోలను తాత్కాలికంగా విధు ల నుంచి తొలగిస్తూ ఉన్నతాధికా రులు చేతులు దులుపుకున్నట్లు ఎండోమెంట్ శాఖలో గుసగుసలు వినపడుతున్నాయి.

● దేవుడి మాన్యం ఆక్రమణ

నీలకంఠేశ్వర ఆలయానికి 70 ఎకరాల మాన్యం ఉంది. అయితే, దేవదాయ అధికారులకు ఆ భూ ములు హద్దులు ఇప్పటికి తెలియకపోవడంతో విచారం. వచ్చిన ప్రతి ఈవో తమ సొంత ఆదా య వనరులుగానే చూస్తున్నారే తప్ప ఆలయానికి ఆదాయం చేకూర్చుదామనే ఆలోచన లేకపోవడం గమనార్హం.

ధూపదీప నైవేద్యాలకు నిధులేవీ?

కోట్ల రూపాయల సంపదన ఇచ్చే మాన్యం భూములు ఉన్నా స్వామివారికి ధూపదీప నైవేద్యాలకు భక్తులు కానుకల మీదే ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఐదేళ్లుగా ఆలయం గోపురానికి కనీసం సున్నం కొట్టించిన దాఖలాలు లేవు. ఇటీవల శివరాత్రి ఉత్సవాలు కూడా పూజారి అప్పుతెచ్చి జరిపించినట్లు మాట్లాడుకుంటున్నారు. శివాలయం దుస్థితికి కారకులపై గ్రామస్థులు, భక్తులు భగ్గుమంటున్నారు.



నీలకంఠేశ్వర ఆలయం

● పంథామార్చి దోపిడీ

ఈవోల సస్పెండ్ వేటుతో వెనుకకు తగ్గిన దోపి డీ ముఠా పంథా మార్చి దందా నిర్వహిస్తు న్నట్లు స్థానికులు మాట్లాడుకుంటున్నారు. ఆలయ భూము లకు ఆనుకొని వ్యాపారి లీజుకు తీసుకు న్న భూముల్లో గ్రావెల్ స్టోన్ గ్రేడింగ్ జరుగుతోం ది. అయితే రాత్రివేళ ఆలయ భూముల్లో ఎక్స్‌క వేటర్‌తో గ్రావెల్ తీసి పక్కనే ఉన్న తన క్వారీలో విలువైన రాళ్ల గ్రేడింగ్ చేసి వచ్చిన ఎర్రమట్టిని తిరిగి ఆలయ భూముల్లో దిబ్బలుగా పోస్తున్నా రు. కొండబీడులో రూ.కోట్లు విలువ చేసే గ్రావెల్ స్టోన్ అక్రమార్కు లకు అడ్డాగా మారినా దేవదాయ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈవోల సస్పెన్షన్ తర్వాత విధుల్లోకి చేరిన అధికారులు కూడా ఈ భూములపై దృష్టి సారించకపోగా జరుగుతున్న దోపిడీ, అవినీతిని అరకట్టే ప్రయత్నం చేయడం లేదని గుసగుసలు వినబడుతున్నాయి.



ఆలయ భూముల్లో తవ్వకాలు జరిపి గ్రేడింగ్ అనంతరం పోసిన గులకరాళ్ల గుట్టలు

బోగోలులో

ఆగని అక్రమాలు

రాత్రింబవళ్లు గ్రావెల్, ఇసుక తవ్వి, తరలింపు !

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారినా బోగోలు మండలంలో మాత్రం గ్రావెల్ అక్రమ తవ్వకాలు మాత్రం ఆగడం లేదు. వైసీపీ హయాంలో తిప్ప, అల్లిమడుగు సంఘం, గంగతిప్ప తదితర ప్రాంతాల్లో రాత్రింబవళ్లు గ్రావెల్, తువ్వఇసుక తవ్వి ఇతర ప్రాంతాల్లో అమ్మి సొమ్ము చేసుకునేవారు. 2023, సెప్టెంబరులో కొందరు భారీ యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు జరుపుతుంటే బాడన్‌పేట, అల్లిమడుగు సంఘం గ్రామస్థులు అడ్డుకున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఆ తర్వాత 2024, నవంబరు 18న బాడన్‌పేట గ్రామ శివారులో గ్రావెల్‌ను తవ్వుతుండగా టీడీపీ నాయకులు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే, పోలీసుల కళ్ళుగప్పి టిప్పర్, ఎక్స్‌కవేటర్‌తో దుండగులు ఉడాయించారు. దొరికిన నంబరు లేని టిప్పర్‌పై ఎస్పై భోజ్యా కేసు నమోదు చేసి మైనింగ్ అధికారులకు అప్పగించారు. అయితే అక్రమ గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న విషయంలో దివ్యాంగుడు రవిపై గ్రావెల్ మాఫియా దాడి చేశారన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేసులు నమోదు చేసినా గ్రావెల్ తవ్వకా లు మాత్రం ఆగడం లేదు. వైసీపీ ప్రభుత్వం పోయి టీడీపీ పాలన వచ్చి 9 నెలలు గడుస్తున్నా మాఫియా మాత్రం చెలరేగిపోతోంది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు గ్రావెల్ కోసం తవ్వకాలు చేస్తున్నారు. తిప్ప, బాడన్‌పేట, కడనూతల, తాళ్ళూరు తదితర గ్రామాల్లో సేక రించిన గ్రావెల్‌ను కావలి రూరల్, రాజుపాలెం, పడుగుపాడు తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు.



పోలీసుల అదుపులో ఉన్న టిప్పర్లు (ఫైల్)

కేసులు నమోదు చేస్తున్నాం

బోగోలు మండల పరిధిలో అక్రమ గ్రావెల్ తరలిస్తున్నట్లు సమాచారం అందితే వెంటనే దాడులు చేస్తున్నాం. అక్రమా ర్కులపై కేసులు కూడా పెడుతున్నాము. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మైనింగ్ అధికారులకు కేసులు అప్పగించి చర్యలు చర్యలు తీసుకుంటున్నాము.

- భోజ్యా, ఎస్‌ఐ బోగోలు

బాయిలర్ లైవ్	142
స్కిన్ చికెన్	256
స్కిన్‌లెస్	282
కోడిగుడ్ల ధర (100)	520

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8704
వెండి కిలో ధర	రూ. 103000
వెండి ఒక గ్రాము	రూ.106.00

చలివేంద్రం ప్రారంభం

కందుకూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దబజారులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద బోణాల చెంచుక్రిష్ణయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీనివాసచక్రవర్తి, కుటుంబసభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పట్టణ సీఐ వెంకటేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో చక్కా వెంకటకేశవరావు, కొత్తూరి సుధాకర్, మురారిశెట్టి సుధీర్ కుమార్, ఇస్కాల సురేంద్ర, కంకణాల వెంకటేశ్వర్లు, తాతా లక్ష్మణ, చీదెళ్ల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అందరిపై అల్లా కరుణ ఉండాలి

● కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ● భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు ● ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు



కావలి : మదీనా మసీదు ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కావలి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రేమ, కరుణ, ఐకమత్యం, సేవాతత్పరత, ఆధ్యాత్మికత వెల్లివిరిసే రంజాన్ పర్వదినం సందర్భంగా అందరిపై అల్లా కరుణ, కటాక్షాలు ఉండాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆకాంక్షించారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని వైకుంఠపురం మదీనా మసీదు, రైల్వేరోడ్డులోని జామియా మసీదులో జరిగిన ప్రార్థనలలో ఆయన పాల్గొని ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేసి అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కాగా కావలిలో ముస్లింలు రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు పట్టణం లోని వివిధ మసీద్‌లు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రైల్వే రోడ్డులోని జామియా మసీద్‌లో ముఫ్తీ రషీద్ మౌలానా ప్రార్థనలు జరిపించారు. వైకుంఠపురంలోని మదీనా మసీద్ ఈద్గాలో ముఫ్తీ ఖలీల్ అహ్మద్ ప్రార్థనలు చేయించారు. మసీదులు, ఈద్గాలలో ప్రవక్తలు రంజాన్ పండుగ ఆవశ్యకతను ముస్లింలకు వివరించారు. ప్రార్థనల అనంతరం ఈద్‌ముబారక్ తెలుపుకుంటూ ఒకరినొకరు అలింగనం చేసుకున్నారు.



ఆత్మకూరు పెద్ద మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

● ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా

రంజాన్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని 34వ వార్డులో సోమవారం ముస్లిం కుటుంబాలకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సతీమణి మలిశెట్టి విజయలక్ష్మిలు సొంత నిధులతో రంజాన్‌తోఫా అందచేశారు. ఈ కార్యక్రమంలో 34వ వార్డు టీడీపీ అధ్యక్షుడు సూరిశెట్టి రామక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి సుందర శ్రీనివాస్ నేతలు పట్నం శివ, సునీత తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

● **కందుకూరు** : రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని పెద్దమజీద్, సంతోష్‌నగర్, జామియా మజీద్, విక్కిరాలపేట రోడ్డు, సుందరయ్య నగర్, జనార్ధనకాలనీ తదితర ప్రాంతాలలో వేలాదిమంది ముస్లింలు సామూహిక ప్రార్థనల్లో పాల్గొని ఒకరినొకరు ఆత్మీయ అలింగనాలతో పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకుంటూ సందడి చేశారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పట్టణ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు షేక్ సలాం ఇంటివద్ద అల్పాహార విందుకు హాజరయ్యారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు కూడా అల్పాహారం విందులో పాల్గొన్నారు. పలువురు బంధువులు, స్నేహితులను తమ నివాసాలకు విందులకు ఆహ్వానించగా మరికొందరు విందు భోజనాలను వారి నివాసాలకు పంపించారు.

● **అల్లూరు** : పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అల్లూరులోని జామియా మసీదు, బీసీ కాలనీలోని మసీదుతోపాటు నార్తు మోపూరు, ఇస్కపల్లిల్లోని మసీదుల్లో ముస్లింలు నమాజులు చేశారు. మతపెద్దలు రంజాన్ పవిత్ర మాసం గురించి వివరించారు.

● **లింగసముద్రం** : రంజాన్ పండుగ సందర్భంగా లింగసముద్రంలోని ముస్లింలు జంగంరెడ్డిపాలెంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే పెదపవనిలోని మసీదులో మత గురువుకు స్థానిక టీడీపీ నేత షేక్ హిదాయతుల్లా, పలువురు ముస్లింలు స్వీట్లు తినిపించారు. చినపవని, ఆర్ఆర్ పాలెం, మొగిలిచెర్ల, మేదరమెట్లపాలెం గ్రామాల్లోని ముస్లింలు ఆయా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● **ఉలవపాడు** : రంజాన్ వేడుకలు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల పాటు కఠోర దీక్షలతో ఉపవాసాలు చేపట్టిన ముస్లింలు సోమవారం ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలతో దీక్షలను ముగించారు. చిన్నా పెద్ద తేడాలేకుండా ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ఉలవపాడులోని ఈద్గా వద్ద ముస్లిం మతపెద్ద ప్రత్యేక ప్రార్థనలు, బోధనలు నిర్వహించారు.

● ముస్లింలకు పండుగ సరుకులు అందజేత

పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని కరేడువాసి, వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి సోమవారం ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందచేశారు. రంజాన్ పండుగకు అవసరమైన వస్తువులు, మాంసం, సరుకులు అందచేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పందలపు సుందరమ్మ, మాజీ సర్పంచు కృష్ణారావు, వైసీపీ నాయకులు షేక్ వలి, ఖాజా, రామనాథం, రామకృష్ణ, మాల్యాద్రి, జాలయ్య తదితరులు పాల్గొన్నారు.

● **కొండాపురం** : సాయిపేట, నేకునాంపేట, కొమ్మి, గుడవల్లూరు, గరిమెనపెంట, తూర్పు ఎర్రబల్లి తదితర గ్రామాల్లో మసీదుల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. పండుగను పురస్కరించుకొని జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు దానధర్మాలు చేశారు.

● **కలిగిరి** : మండలంలోని మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్నేహితులు, బంధుమిత్రులకు పలువురు ముస్లింలు విందుభోజనాలు ఏర్పాటు చేశారు. హిందువులు ముస్లింలకు ఈద్‌ముబారక్ తెలియజేశారు.



కావలి : పట్టణంలోని జామియా మసీదులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి



లింగసముద్రం : జంగంరెడ్డిపాలెం ఈద్గాలో...



ఉలవపాడు : ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కొండాపురం : సాయిపేటలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



బిట్రగుంట : రంజాన్ విశిష్టతను వివరిస్తున్న ఇమామ్‌సాబ్

● **బిట్రగుంట** : బోగోలు మండలంలో ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చెంచులక్ష్మీపురం ఈద్గా వద్ద ఇమామ్‌సాబ్ సోయబ్ అత్తర్ రంజాన్ విశిష్టతను వివరించారు, విశ్వనాథరావుపేటలోని ఇబ్రహీం పేట, నాగులవరం, పాతబిట్రగుంట ఈద్గాల వద్ద రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

● ముస్లింలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి : ముస్లింలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. మండలంలో ముస్లింలు రంజాన్ వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకు న్నారు. స్థానిక ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేప ట్టారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్, టీడీపీ నా యకులు ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈద్గా మైదానం చుట్టూ ప్రహరీ నిర్మాణంతోపాటు తాగునీటి సౌకర్యం ఏర్పాటుకు చర్యలు చేపడతానన్నారు. ఉదయగిరి పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడం తోపాటు దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మం డల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, టీడీపీ నాయకులు గడ్డం వెంక టేశ్వర్లు, నల్లిపోగు రాజా, సందానీ, రంతుజాని, శ్రీకుర్తి రవీంద్రబాబు, తుమ్మల కిరణ్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● **దుత్తలూరు**: మండలంలోని నందిపాడు, వెంకటంపేట, నర్రవాడ, ఏరుకొల్లు తదితర గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లోని ఈద్గా మైదానాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

వరికుంటపాడు(ఉదయగిరిరూరల్): రంజాన్ సందర్భంగా మండలంలోని తోటల చెరువుపల్లి, కొత్తపల్లి, విరువూరు, తిమ్మారెడ్డిపల్లి, హుస్సేన్‌నగర్, రామాపురం, వరికుంటపాడు, జడదేవి, తూర్పుబోయమడగల తదితర గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహిళలు సైతం నివాసాల్లోనే ప్రార్థనలు చేపట్టారు. అనంతరం కులమతాలకతీతంగా విందు భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు.

● **సంగం** : మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లింలు రంజాన్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల ఈద్గా మసీద్‌లల్లో ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు వస్త్ర, ధన, అన్నదానాలు నిర్వహించారు. సంగం, దువ్వూరు, సిద్దీపురం, జండాదిబ్బ, తలుపూరుపాడు, మర్రిపాడు తదితర ప్రాంతాల ఈద్గాలలో ప్రార్థనలు చేసి ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.

● **అనంతసాగరం**: మండలంలోని సోమశిల, ముస్తాపురం అనంతసాగరం, ఉప్పలపాడు, గౌరవరం, కచ్చేరిదేవరాయపల్లి, పీకేపాడు, పాతదేవరాయపల్లి. ఆమనిచిరివేళ్ల గ్రామాల్లో సోమవారం ఘనంగా రంజాన్ వేడుకలు నిర్వహించారు. ముస్లీంలు ఈద్గా ప్రాంగణాలకు చేరుకొని ప్రత్యేక నమాజులో పాల్గొన్నారు.

● **ఏఎస్ పేట**: మండలంలోని ఏఎస్‌పేట, హసనపురం, చిరమన, రాజవోలు, గుంపార్లపాడు, గుడిపాడు, అనుమసముద్రం తదితర గ్రామాలలో సోమవారం రంజాన్ పండుగను ముస్లీంలు ఘనంగా నిర్వహించారు. ఏఎస్ పేటలోని నాయబ్‌రసూల్ దర్గా మసీదులో అత్యధికంగా ముస్లీంలు పాల్గొని ప్రార్ధనలు నిర్వహించారు. దర్గా ఈవో షేక్ మహ్మద్ హుస్సేన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నమాజ్ అనంతరం పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు.

● **సీతారామపురం**: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో ముస్లింలు ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గాన్ని అనుసరించాలని సూచించారు.

● **వింజమూరు** : రంజాన్ సందర్భంగా పట్టణం, మండలంలోని గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పేదలకు దానధర్మాలు చేశారు.

● **ఆత్మకూరు** : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు పెద్ద మసీదులో ముస్లీం మత పెద్ద ఇమామ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పేదలకు దాన ధర్మాలు చేశారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో ముస్లీంలు ఈద్గా, మసీదులలో ప్రార్థనలు చేసి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.



వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



సంగం : ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కావలి పట్టణంలోని మసీదు వద్ద రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ముస్లింల నిరసన



అనంతసాగరం : నిరసన ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

ఉదయగిరి, మార్చి 31 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని బిజ్జం పల్లి గ్రామంలో సోమవారం ఆవాజ్ కమి టీ ఆధ్వర్యంలో ముస్లింలు నూత నంగా అమలుచేసిన వక్ఫ్‌బోర్డు చట్ట సవరణలకు వ్యతిరేకంగా నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈద్గా మైదానంలో రంజాన్ ప్రత్యేక ప్రార్థనల అనంతరం వారు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, ఇమామ్‌లు, మౌజన్‌లు తదితరులు పాల్గొన్నారు.

● **అనంతసాగరం** : వక్ఫ్‌బోర్డు చట్ట సవరణలకు వ్యతిరేకంగా స్థానిక ముస్లీంలు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేశారు. సవరణ బిల్లు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

● **ఏఎస్ పేట** : నూతన వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం స్థానిక దర్గా సెంటర్‌లో ముస్లింలు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లీంలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు దేవరబోడుపై ఉన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజైన సోమవారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్లను ఉంచి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణతంతు నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి గ్రామంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో పొంగళ్లు పొంగించి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కావలి రెడ్‌క్రాస్ చైర్మన్‌కు ఉగాది పురస్కారం

కావలి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కావలి శాఖ చైర్మన్ డాకారపు రవిప్రకాష్‌కు దీపం ఉగాది పురస్కారం దక్కింది. విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞానకేంద్రంలో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, జీఆర్కే-పోలవరపు సాంస్కృతి సమితి, అంతర్జాల తెలుగు మాసపత్రికల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి దీపం ఉగాది పుసరస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో సామాజిక సేవా విభాగంలో రవిప్రకాష్‌కు ఆంధ్రప్రదేశ్ సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి డాక్టర్ కే.మన్మథరావు, మాజీ పార్లమెంట్ సభ్యుడు గోకరాజు గంగరాజు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణలు ఈ పురస్కారం అందచేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కొంపల్లి సుందర్, తమ్మా శ్రీనివాసులరెడ్డి, గోళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



రవిప్రకాష్‌ను సత్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ మన్మథరావు తదితరులు

వచ్చే విద్యా సంవత్సరం నుంచి అంగన్‌వాడీ, ప్రీస్కూల్ ఏర్పాటు

● ఎస్సీ కాలనీవాసులకు అధికారుల హామీ

సంగం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో సంగం పాత చెక్‌పోస్టు ఎస్సీ కాలనీలో సోమవారం ఐసీడీయస్ పీడీ నిర్మలాదేవి, ఆత్మకూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి జానకీరామ్ పర్యటించారు. శనివారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఎస్సీ కాలనీవాసులు కలిసి తమ కాలనీలోనే అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి ఆదేశాల మేరకు ఐసీడీయస్ పీడీ నిర్మలాదేవి, ఉప విద్యాశాఖాధికారి జానకీరామ్ ఎస్సీ కాలనీవాసులను కలిసి అంగన్‌వాడీ కేంద్రం, 1, 2 తరగతులు నిర్వహించే ప్రీస్కూల్ ఏర్పాటుకు ఎంతమంది పిల్లలు ఉన్నారని ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎస్సీ కాలనీలోనే అంగన్‌వాడీ కేంద్రంతోపాటు, ప్రీస్కూల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కాలనీవాసులు మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఐసీడీయస్ సూపర్‌వైజర్లు, విద్యాశాఖాధికారి మల్లయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, కాలనీవాసులు ఉన్నారు.



కాలనీలో చిన్నారులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ నిర్మలాదేవి, డిప్యూటీ డీఈవో జానకిరామ్

ఘనంగా పరుశురామ ఆలయ వార్షికోత్సవం



వార్షిక వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల దంపతులు

వింజమూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండెమడకలలోని పరుశురామ ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, సతీమణి ప్రవీణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి కాకర్లను ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండెమడగల గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

అనంతసాగరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఅగ్రహారం బస్టాండ్‌లో సోమవారం వైసీపీ నాయకులు అక్కలరెడ్డి భాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీ టీసీ కొండారెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగార్జున పాల్గొన్నారు.

పైడేరు బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమి పూజ

దగదర్తి(బిట్రగుంట), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలంలోని తురిమెర్ల వద్ద ఉన్న పైడేరు బ్రిడ్జి నిర్మాణ పనులకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి సోమవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతు దగదర్తి రైతుల సాగునీటి సమస్యలను దృష్టిలో పెట్టుకుని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి రూ.3 కోట్ల మంజూరు చేయించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నీటిసంఘం అధ్యక్షుడు అల్లం రాధాయ్య, ప్రతాప్, చెన్నూరు నీటి సంఘం అధ్యక్షుడు పాపన మల్లికార్జునరెడ్డి, చల్లా శ్రీహరి, ఎం.వెంకటేశ్వర్లు, పీ.సుధాకర్, గోపాలచంద్ర, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న టీడీపీ నేత పమిడి

చెన్నూరులో సమస్యలపై మాలేపాటి ఆరా

దగదర్తి(బిట్రగుంట), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం చెన్నూరులో సమస్యలపై ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు ఆరా తీశారు. ఈ మేరకు సోమవారం గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో కొందరికి పింఛన్, ఆరోగ్యశ్రీ, రేషన్‌కార్డులు మంజూరు కాలేదని టీడీపీ మహిళా నేత పందల రమణమ్మ, నిజాం అంకబాబులు తెలిపారు. గ్రామంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, చాలా మందికి పక్కాగృహాలు మంజూరు చేయించాలని కోరారు. టీడీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని అందుకు మాలేపాటి కుటుంబం సహాయసహకారాలు ఉంటాయని రవీంద్ర నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు మాలేపాటి సుధాకర్ నాయుడు, స్థానిక నాయకులు సీహెచ్.శీనయ్య, ఎం.కృష్ణయ్య, ఏ.రమణ య్య, జీ.రమేష్, పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న మాలేపాటి

పాస్టర్ మృతిపై నిరసన ర్యాలీ



కలువాయి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై న్యాయ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సోమవారం కలువాయిలో నెల్లూరు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ కలువాయి కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధులలో గుండా సాగిన ర్యాలీలో పాస్టర్లు, క్రైస్తవ సంఘాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ప్రవీణ్ పగడాల కేసులో వెంటనే న్యాయం జరగాలని డిమాండ్ చేశారు.

నేడు సిద్దీపురంలో ఆర్‌డీఎస్ఎస్ పనులు

సంగం : సిద్దీపురం విద్యుత్ ఉప కేంద్రంలో మంగళవారం ఆర్‌డిఎస్ఎస్ పనులు చేస్తున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ మన్మధరావు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ మోటార్ల మాదిరిగానే గృహాలకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేసేందుకు నూతనంగా బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈకారణంగా సిద్దీపురం, మక్తాపురం, దువ్వూరు, వెంగారెడ్డిపాళెం ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుంది.

భక్తిశ్రద్ధలతో రంజాన్

● మసీదు, ఈద్గాలలో సామూహిక ప్రార్థనలు

రంజాన్ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మార్చి 2వతేదీ ప్రారంభమైన రంజాన్ మాసం మార్చి 30వ తేదీ రాత్రి నెలవంక దర్శనంతో ముగిసింది. దీంతో సోమవారం ఈ పండుగను జరుపుకున్నారు. నెలరోజులపాటు కఠోర ఉపవాస దీక్షలతోపాటు ధర్మనిరతిని పాటిస్తూ శాంతి, సహనాలతోపాటు దానధర్మాలు నిర్వహించారు. ఈ మాసంలో ఉద్భవించిన పవిత్ర గ్రంథాన్ని పఠనం చేయడంతోపాటు మసీదుల్లో 5 పూటలా నమాజ్‌లు క్రమం తప్పకుండా చేశారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు పూర్తి చేసుకునేందుకు దయ చూపిన అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకు సోమవారం ఈద్గాలలో సామూహిక ప్రార్థనలు చేశారు. జిల్లావ్యాప్తంగా 444 మసీదులు, ఈద్గాలలో ప్రార్థనలు జరిగాయి. ఆయా ప్రాంతాల్లో ముస్లింలకు నగర పాలక సంస్థ, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీ, మంచినీరు, షామియానాలు, పారిశుధ్యం మెరుగుతోపాటు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నెల్లూరులోని బారాషహీద్ దర్గా ప్రాంగణంలో జరిగిన ప్రార్థనలు ముస్లింలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా బారాషహీద్ దర్గా ఇమామ్ సయ్యద్ అబూబకర్ అష్రఫి సాబిరి వారిని ఉద్దేశించి ప్రసంగించారు. కావలి, కందుకూరు, ఆత్మకూరు డివిజన్ల పరిధిలోని గ్రామాల్లో రంజాన్ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొని దువా చేసి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)


నెల్లూరు : బారాషహీద్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు




ఉదయగిరి : వక్ఫ్ బోర్డు చట్టసవరణకు వ్యతిరేకంగా విజ్ఞాపల్లిలో నల్లరిబ్బన్లు ధరించి..


పొదలకూరు ఈద్గా వద్ద..


కావలి : రంజాన్ తోఫా అందజేస్తున్న టీడీపీ నేత మలిశెట్టి వెంకటేశ్వర్లు


ఉదయగిరిలో ముస్లింల మధ్య ఎమ్మెల్యే కాకర్ల సురేష్


వెంకటాచలం : కసుమూరు దర్గాలో పడమటి వాకిలి వద్ద భక్తులు


అనంతసాగరంలో సామూహిక ప్రార్థనలు


బుచ్చిరెడ్డిపాళెంలో సామూహిక ప్రార్థనలు


అల్లూరులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

నేడు టెన్త్ సోషల్ పరీక్ష

నెల్లూరు(విద్య), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా వాయిదా వేసిన టెన్త్ సోషల్ స్టడీస్ పరీక్షను మంగళవారం నిర్వహించనున్నట్లు డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు జరిగే ఈ పరీక్షకు విద్యార్థులంతా హాజరయ్యేలా హెచ్ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు.

సమస్యలపై రేపు ఫ్యాప్టో నిరసన

నెల్లూరు(విద్య), మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పీఆర్సీ, ఐఆర్ బకాయిల విడుదల కోసం, ఇతర సమస్యలపై బుధవారం సాయంత్రం మూడు గంటలకు నెల్లూరులోని కలెక్టరేట్ ఎదురుగా నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ కంచర్ల మధుసూదన్‌రావు, జనరల్ సెక్రటరీ షేక్.జావీద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్ల సమస్యలపై చేస్తున్న ఈ పోరాటంలో జిల్లాలోని ఉపాధ్యాయులంతా పాల్గొని, విజయవంతం చేయాలని తెలిపారు.

సోమశిలలో 53.374 టీఎంసీల నీరు

అనంతసాగరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 53.374 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 330, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు డ్యాం అధికారులు వెల్లడించారు.

'ప్యాకేజీ-1'పై విచారణకు ఆదేశం

● విచారణాధికారిగా ఇరిగేషన్ డిప్యూటీ ఎస్ఈ

నెల్లూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పెన్నా డెల్టా ఆధునికీకరణ ప్యాకేజీ-1 పనుల్లో జరిగిన అక్రమాలపై ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్ విచారణకు ఆదేశించారు. ఇరిగేషన్ డిప్యూటీ ఎస్ఈ శరత్‌కుమార్‌ను విచారణాధికారిగా నియమించారు. నెల్లూరు సెంట్రల్ డివిజన్‌లోని ప్యాకేజీ-1కు సంబంధించిన రికార్డులన్నింటినీ స్వాధీనం చేసుకొని విచారణ జరపాలని ఎస్ఈ ఆదేశించారు. అలానే క్వాలిటీ కంట్రోల్ కార్యాలయంలోని రికార్డులను కూడా తెప్పించి ఆ రికార్డులనూ పరిశీలించాలని సూచించారు. ప్యాకేజీ-1కు సంబంధించి ఇప్పటి వరకూ ఎన్ని బిల్లులు ఇచ్చారు..? ప్రీక్లోజ్‌కు ఎంత మొత్తంతో ప్రతిపాదించారు..? ఆ తర్వాత పనులు ఏమైనా జరిగాయా..? ప్రీక్లోజ్‌కు ముందు, తర్వాత రివైజ్ ఏ మేర జరిగింది..? సెంట్రల్ డివిజన్‌లో రికార్డు చేసిన బిల్లులు మేరకే క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్లు జారీ చేశారా.. లేదా..? క్యూసీ సర్టిఫికెట్‌లో కొట్టి వేతలు చేసి మొత్తం పెంచడానికి కారణాలేమిటి..? వంటి వివరాలను విచారణలో తేల్చాలని ఎస్ఈ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఎస్ఈ ఆదేశాల మేరకు డిప్యూటీ ఎస్ఈ విచారణ ప్రారంభించారు. ప్యాకేజీ-1లో జరిగిన అవకతవకలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చింది. గత నెలలో 'దోచిపెట్టడానికే దిద్దారా..?', 'ప్యాకేజీ-1లో ఎన్నెన్నో సిత్రాలు..!', 'అంతా గప్‌చుప్' అనే శీర్షికలతో వరుస కథనాలు ప్రచురించింది. స్పందించిన కలెక్టర్ ఆనంద్.. ప్యాకేజీ-1 వర్కుపై నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు. ఈ క్రమంలో ఆరోపణలపై వివరణ ఇవ్వాలంటూ సెంట్రల్ డివిజన్ ఈఈకు ఎస్ఈ మెమో జారీ చేశారు. అయినా సమాధానం రాకపోవడంతో మరోసారి మెమో ఇచ్చారు. ఆ తర్వాత సెంట్రల్ డివిజన్ ఈఈ తన వివరణ ఇచ్చారు. దీన్ని పరిశీలించిన ఎస్ఈ పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. డిప్యూటీ ఎస్ఈ విచారణ పూర్తి చేసి నివేదిక అందజేశాక దాన్ని కలెక్టర్‌కు అందించనున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నేటి నుంచి సదరం క్యాంపులు

● దివ్యాంగులకు గుర్తింపు పత్రాలు అందచేత ● మూడు నెలల తర్వాత వైద్యపరీక్షలు
● కొత్త వారికి శుభవార్త ● పాత సర్టిఫికెట్లపైనా కొనసాగనున్న విచారణ

నెల్లూరు (వైద్యం), మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది జనవరి నుంచి ఆగిపోయిన సదరన్ క్యాంపులు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఇది దివ్యాంగులకు శుభవార్త. జిల్లాలోని 8 ఆసుపత్రులలో దివ్యాంగులను గుర్తించే సదరన్ క్యాంపులు అందుబాటులోకి వస్తున్నాయి. నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితోపాటు ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కందుకూరు, కావలి ఏరియా ఆసుపత్రులు, కోవూరు, ఉదయగిరి, ఉలవపాడు, పొదలకూరు వంటి సామాజిక ఆసుపత్రులలో ఈ క్యాంపులు జరగనున్నాయి. ఇప్పటికే సుమారు నాలుగు వేల మంది దివ్యాంగులు సర్టిఫికెట్ల కోసం వేచి చూస్తున్నారు. వీరి ఆశలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం కూడా అనుమతులు ఇవ్వటంతో నేటి నుంచి తమకు కేటాయించిన తేదీలలో సదరన్ క్యాంపులకు దివ్యాంగులు వెళ్లనున్నారు.

● నకిలీ సర్టిఫికెట్ల ఆరోపణలు

గత వైసీపీ హయాంలో కొంతమంది వైద్యులపై ఒత్తిడి తెచ్చి నకిలీ సర్టిఫికెట్లు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో ఆయా దివ్యాంగుల సర్టిఫికెట్లపై విచారణకు ఆదేశించింది. జిల్లా వ్యాప్తంగా 32,638 దివ్యాంగ సర్టిఫికెట్లు ఉన్నాయి. వీటిలో చాలా వరకు నకిలీవేనని ప్రభుత్వం గుర్తించింది. దివ్యాంగ పెన్షన్ కూడా రూ.4వేల నుంచి 6వేలకు పెరగడంతో ఈ నకిలీ సర్టిఫికెట్ల గుట్టు తేల్చాలంటూ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని 7 ఆసుపత్రులలో దివ్యాంగ సర్టిఫికెట్లపై వైద్యులు విచారిస్తున్నారు. జిల్లా వైద్యులు కాకుండా చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి వైద్య నిపుణులు కూడా జిల్లాకు చేరుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాలోని దివ్యాంగులను పరీక్షిస్తూనే కొత్తగా దివ్యాంగుల పరీక్షలు కూడా జరగనున్నాయి.


దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం

దివ్యాంగ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎంపిక

నెల్లూరు(విద్య), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దర్గామిట్ట ఎంసీయూపీ పాఠశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో శారీరక దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం ఎంపికైంది. గౌరవాధ్యక్షుడిగా జీ.కోదండరామయ్య, అధ్యక్షురాలుగా పీ.నాగమణి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పెంచలయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్‌కె.రియాజ్, ప్రధాన కార్యదర్శిగా ఎంపీ.నరసింహులు, అదనపు ప్రధాన కార్యదర్శులుగా బాలసుబ్రహ్మణ్యం, మృదుల, బీ.శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎ.హరి, మహిళా కార్యదర్శులుగా పీ.విజయలక్ష్మి, సుభద్ర, రాధిక, ప్రచార కార్యదర్శులుగా జీ.రవి, సురేష్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ ఎన్నికలకు రాష్ట్ర నాయకులు నాగేంద్రబాబు, వెంకటేశ్వర్లు పరిశీలకులుగా వ్యవహరించారు.

మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకు మరో దెబ్బ!

● ముఖ్య అనుచరుడు 'దొడ్డంరెడ్డి' వైసీపీకి గుడ్‌బై



కోవూరు, మార్చి31 (ఆంధ్రజ్యోతి) : కోవూరు నియోజవకర్గంలో మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన ముఖ్య అనుచరుడు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డంరెడ్డి నిరంజనబాబురెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధపడ్డారు. క్రియాశీలక రాజకీయాల నుంచి తాను వైదొలగుతున్నట్లు సోమవారం దొడ్డంరెడ్డి ప్రకటించారు. సుదీర్ఘ కాలంపాటు ప్రసన్నకుమార్‌రెడ్డి ముఖ్య అనుచరుడిగా నియోజకవర్గ రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్న ఆయన అంతర్గత విభేదాల వల్ల వైసీపీని వీడుతున్నట్లు తెలిసింది. కోవూరు మండల పార్టీ విభాగాల కమిటీల నిర్ణయంలో తలెత్తిన వివాదంలో ప్రసన్న తనను చిన్నచూపు చూశారంటూ దొడ్డంరెడ్డి మనస్తాపానికి గురయ్యారు. ఈ వ్యవహారంపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలతో విభేదాలు లేవని అన్నారు. తాను ఎవరినీ విమర్శించననీ, రాజకీయాలకు దూరంగా ఉండాలనుకుంటున్నట్లు చెప్పారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

● అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఎల్-1 స్కానర్ల వినియోగం

నెల్లూరు (హరనాథపురం), మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో అవకతవకలకు ఆస్కారం లేకుండా ఎల్-1 స్కానర్ల ద్వారా మంగళవారం ప్రారంభమవుతుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ స్కానర్లు కొత్తవి కావడంతో మొరాయించే అవకాశం ఉన్నందున ఇప్పటివరకు వినియోగిస్తున్న ఎల్-0 స్కానర్లను కూడా వినియోగించనున్నారు. జిల్లాలో 6400 ఎల్-1 స్కానర్లను ఇప్పటికే సచివాలయాలకు పంపిణీ చేయగా, 6400 మంది ప్రభుత్వ సిబ్బంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేయనున్నారు. కాగా, సచివాలయ సిబ్బంది శనివారమే బ్యాంకుల నుంచి పింఛన్ల మొత్తాన్ని డ్రా చేశారు. జిల్లాలో 3,06,515 లక్షల పింఛనుదారులకు రూ.132.30 కోట్లు అందజేయనున్నారు.

● దివ్యాంగ విద్యార్థులకు బ్యాంకు ఖాతాల్లో...

సొంత ప్రాంతాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉంటూ చదువుకుంటున్న దివ్యాంగ విద్యార్థులకు వారి పింఛను సొమ్మును బ్యాంకు ఖాతాల్లో వేయనున్నారు. ఇందుకోసం దివ్యాంగ విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, బోనఫైడ్ సర్టిఫికెట్, బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు తదితరాలను సంబంధిత సచివాలయాల్లో సమర్పించాలి. ఒక్కో దివ్యాంగ విద్యార్థికి ప్రతి నెల రూ.6 వేలు పింఛను అందజేస్తున్నారు.

● రేషన్ సరుకులు..

జిల్లాలో రేషన్ సరుకులు పంపిణీ మంగళవారం ప్రారంభం కానుంది. జిల్లాలో 7.35 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. 1513 షాపులు, 438 ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయనున్నారు.

'ఉపాధి' కూలి రూ.307లకు పెంపు

ఉదయగిరి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేసే కూలీలకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. దినసరి వేతనం రూ.300 నుంచి 307లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రతి ఏడాది ప్రజల కొనుగోలు శక్తి, ధరల ఆధారంగా ప్రభుత్వం వేతనాలను నిర్ణయిస్తుంది. అందులో భాగంగా పెంచిన దినసరి వేతనం ఏప్రిల్ 1 తేదీ నుంచి అమల్లోకి రానుంది.



● కూలీలకు లబ్ధి

దినసరి వేతనం పెంపుతో ఉపాధి హామీ కూలీలకు లబ్ధి చేకూరింది. గ్రామాల్లో వలస నివారణతోపాటు స్థానికంగా ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసింది. ప్రధానంగా మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, కలిగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, మర్రిపాడు, ఏఎస్‌పేట, అనంతసాగరం, పొదలకూరు, కొండాపురం తదితర మండలాల్లో అధిక శాతం కూలీలకు ఈ పనులే జీవనాధారం. జిల్లాలో 3.46 లక్షల జాబ్‌కార్డులు ఉండగా 5.81 లక్షల మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలో రోజుకు సుమారు 50 వేలు మంది ఉపాధి హామీ పనులకు హాజరవుతుండగా సరాసరి వేతనం రూ.266 నమోదవుతోంది. దినసరి వేతనం పెంపుతో రోజువారి సరాసరి వేతనం సైతం పెరగనుండడంతో ఉపాధి కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దేవరపాళెంలో అనుమానాస్పద మృతి

● పాఠశాల సంపులో వ్యక్తి మృతదేహం
● హత్యా... లేక ఆత్మహత్యా...? విచారిస్తున్న పోలీసులు


శేషయ్య (ఫైల్)

నెల్లూరు రూరల్, మార్చి31, (ఆంధ్రజ్యోతి): నెల్లూరు - తాటిపర్తి మార్గమధ్యంలోని దేవర పాళెంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించి ఉండటాన్ని సోమ వారం రూరల్ పోలీసులు గుర్తించారు. గ్రామానికి చెందిన మాచనూరు శేషయ్య (48) శుక్రవారం రాత్రి నుంచి కనిపించకుండా పోయారు. ఈ క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన సంపులో శేష య్య మృతదేహం అనుమానాస్పదంగా కనిపించింది. ఆయనది హత్యా... లేక ఆత్మహత్యా... ?అనే విషయమై పోలీసులు ఇంకా పూర్తి నిర్ధారణకు రాలేదు. అన్నీ కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా శుక్రవారం రాత్రి నుంచి కనిపించకుండా పోయిన శేషయ్య విషయమై ఆయన కుటుంబ సభ్యులు పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదన్న కోణం అందరినీ ఆలోచింప చేస్తున్నది. పైగా గ్రామానికి చెందిన ఓ యువకుడు శనివారం ఉదయం సంపులో మృతదేహం ఉన్నట్లు అనుమానంగా ఉందని, స్కూల్ టీచర్లకు చెప్పడం, ఎవరో లాగిన గుర్తులున్నాయని పేర్కొనడం, సదరు వ్యక్తి అప్పటి నుంచి గ్రామంలో లేకపోవడం, అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడం పట్ల పలు అనుమానాలు కలుగుతున్నాయి. ఘటనా స్థలం వద్ద ఆనవాళ్లను పరిశీలించిన డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గుంజి వేణు, ఎస్‌లు మృతదేహం బాగా ఉబ్బి ఉండటం వల్ల గాయాలున్నాయో.. లేవో.. స్పష్టంగా తెలియడంలేదని పేర్కొన్నారు. మంగళవారం నాటికి ఈ విషయమై స్పష్టత వస్తుందని వారు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నెల్లూరు జీజీహెచ్‌కి తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మద్దూరుపాడులో రైతు మృతి

కావలి రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని రైతు కొండా వెంకట సుబ్బయ్య(68) మృతి చెందిన ఘటన సోమవారం కావలి పట్టణం మద్దూరుపాడు సమీపంలో కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మద్దూరుపాడుకు చెందిన వెంకట సుబ్బయ్య పొలానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య వెంకట సుశీల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ బాజీబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. రైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కాపుకాచి చోరీ

● 4 కేజీల వెండి, 50 గ్రాముల బంగారం అపహరణ
● బైక్‌పై పరారైన నిందితులు


చోరీ అనంతరం బైక్‌పై పరారవుతున్న నిందితులు (సీసీ ఫుటేజ్)

ఆత్మకూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఓ బంగారు దుకాణం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు కాపుకాచి చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. బాధితుడి కథనం మేరకు.. పట్టణానికి చెందిన రమణమూర్తి ప్రధాన బజార్‌లో బంగారు దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజూ దుకాణం మూసేటప్పుడు దుకాణంలోని వెండి, బంగారం సంచిలో పెట్టుకుని తాళాలు వేసుకుని వెళ్లేవాడు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి 8 గంటలకు దుకాణంలోని వెండి, బంగారు నగలను సంచిలో పెట్టుకుని దుకాణానికి తాళాలు వేసేందుకు బయటకు వచ్చాడు. చేతిలో ఉన్న వెండి, బంగారు నగల సంచిని కింద పెట్టి షట్టర్ దించి తాళాలు వేస్తుండగా బైక్‌పై కాపుకాసున్న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తుల్లో ఒకరు వచ్చి కింద పెట్టిన సంచి తీసుకుని బైక్‌పై పరారయ్యారు. సంచిలో 4 కేజీల వెండి, 50 గ్రాముల బంగారం ఉన్నట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఈమేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ గంగాధర్ సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. సమీపంలోని సీసీ కెమెరాల్లో సీసీ ఫుటేజ్‌ని పరిశీలించారు. పోలీసులతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి నిందితులను పట్టుకుంటామని ఆయన తెలిపారు.

హరికథకుడికి ఉగాది పురస్కారం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): 6వేలకు పైగా స్టేజీ హరికథలు చెప్పిన బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన ముత్యాల విశ్వనాధంకు (కొండపల్లి విశ్వనాధం) ఉగాది పురస్కారం లభించింది. నెల్లూరులో ఆదివారం కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోవడంపై పలువురు అభినందనలు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	142
స్కిన్ చికెన్	256
స్కిన్‌లెస్	282

కోడిగుడ్ల ధర (470): 520

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8704
వెండి కిలో ధర	రూ.1,03000
వెండి ఒక గ్రాము	రూ.106.00

మోదుగ సమిధలతో హోమం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సీతారామచంద్రస్వామికి పాలభిషేకం, సాయంత్రం తామర పూలతో అర్చన, అనంతరం మోదుగ సమిధ (పుల్లలు)లతో హోమం జరిగింది. రాత్రి హారతి, ప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు నరేష్ తదితరులు పర్యవేక్షించారు.

న్యూస్ బాక్స్

స్వర్ణలింగేశ్వరుడికి హంపీ పీఠాధిపతి అర్చన



స్వర్ణలింగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న హంపీ పీఠాధిపతి

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గణేష్ ఘాట్ వద్ద ఉన్న స్వర్ణలింగేశ్వరుడికి సోమవారం హంపీ విరూపాక్ష విద్యారణ్య సంస్థానాధిపతి విద్యారణ్య భారతిస్వామి రుద్రాభిషేకం, అర్చన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొనలేనిది జ్ఞానశక్తి మాత్రమేనని, దైవచింతనతోనే జ్ఞాన శక్తి లభ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో పీ.సురేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, హర్షవర్ధన్, పీ.సత్యనాగేశ్వరరావు, పేటేటి భాస్కర్‌రావు, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ గ్రామోత్సవం



మనుబోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మనుబోలులో ఆదివారం అర్ధరాత్రి గంగమ్మ గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించి బాణాసంచా వేడుకల నడుమ అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. నైవేద్యాలు చెల్లించి యాదవులు మొక్కులు తీర్చుకున్నారు.

మినగల్లులో ఘర్షణ ఇద్దరికి గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మినగల్లు గ్రామ దళితవాడలో ఆదివారం రాత్రి ఇరువురి మధ్య జరిగిన వివాదం చినికి చినికి మారణాయుధాలతో దాడికి దారితీసింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ సంతోష్ రెడ్డి కథనం మేరకు... మినగల్లుకు చెందిన బచ్చు వినయ్, బుట్టి సుధీర్ మధ్య వివాదం జరిగి సద్దుమణిగింది. కొంతసేపటి తరువాత మళ్లీ ఘర్షణ జరిగి మారణాయుధాలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో గాయపడిన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో బుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఉపవాస దీక్షతో పుణ్యం అపరిమితం





నెల్లూరు బారాషహీద్ దర్గాలో ముస్లింల ప్రార్థనలు

- బారాషహీద్ దర్గా ఇమామ్ అబూబకర్
- ఉత్సాహంగా రంజాన్ పర్వదినం

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 31 (ఆంధ్ర జ్యోతి): ఇస్లాంలో నమాజ్, జకాత్, హజ్ యాత్ర ద్వారా వచ్చే పుణ్యం కన్నా, రంజాన్ ఉపవాసాల వల్ల కలిగే పుణ్యం అపరిమితమని బారా షహీద్ దర్గా ఇమామ్ సయ్యద్ అబూబకర్ అష్రఫీ సాబిరి తెలిపారు. సోమవారం నగరంలో బారా షహీద్ దర్గా ప్రాంగణంలోని ఈద్గాలో రంజాన్ ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన ప్రవచనం చేశారు. సర్వలోక సృష్టికర్త అల్లాహ్ మానవుల పట్ల దయతో ఉన్నాడని చెప్పారు. అందువల్ల అందరం దైవ ఆజ్ఞలకు కట్టుబడి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, నగర కార్పొరేటర్లు పాల్గొని దువా చేసి, ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైసీపీ జిల్లా ఇన్‌చార్జి పీ. చంద్రశేఖర్‌రెడ్డి, సంతపేట ఈద్గాలో రంజాన్ ప్రార్థనలు చేశారు. జనసేన నాయకులు స్థానిక ఈద్గాలలో ప్రార్థనలు చేశారు.అలాగే నవాబుపేట, జాకీర్ హుస్సేన్ నగర్, పడుగుపాడు, బర్మాసెల్‌గుంట, కొత్తూరు, బుజబుజనెల్లూరు, పడారుపల్లి, తదితర ప్రాంతాల్లోని ఈద్గాల్లో కూడా సామూహిక ప్రార్థనలు జరిగాయి.

● అండగా చంద్రబాబు

ముస్లింలకు అండగా సీఎం చంద్రబాబు ఉన్నారని వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తెలిపారు. బారా షహీద్ దర్గా ప్రాంగణంలోని ఈద్గాలో జరిగిన నమాజ్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ వక్ఫ్‌బిల్లు అమెండ్‌మెంట్‌లు పూర్తిగా బయటకు రాలేదని, ముస్లిం మనోభావాలు దెబ్బతినే అంశాలను చంద్రబాబు ప్రోత్సహించరని తెలిపారు.

● వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

కేంద్రం తెస్తున్న వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా పలు ముస్లిం పార్టీలు సోమవారం ఈద్గాల వద్ద ప్లకార్డులు ప్రదర్శన, కరపత్రాల పంపిణీ చేపట్టాయి. బారాషహీద్ దర్గా మైదానంలో ఒక వైపు రంజాన్ ప్రార్థనలు జరుగుతుంటే, మరోవైపు సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా, ఎస్‌డీపీఐ మ్యూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) ఏఐఎంపీఎల్ పార్టీలు నిరసన వ్యక్తం చేశాయి.

● ముత్తుకూరు : రంజాన్ వేడుకలను ముత్తుకూరులో ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలవద్ద ఇమామ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్ద నమాజ్‌కు సౌకర్యాలు కల్పించిన సర్వేపల్లి ఎమ్మెల్యే చంద్రమోహన్‌రెడ్డికి ముస్లింలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అబ్దుల్ షఫీవుల్లా, మహబూబ్‌బాషా, ఫరీద్‌బాబు, షేక్ కాలేషా, సయ్యద్ నవీద్‌బాషా, జమీల్, జావీద్, ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

● పొదలకూరు : మండల వ్యాప్తంగా ముస్లింలు సోమవరం రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. స్థానికంగా ఉన్న ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాహ్‌ను ప్రార్థించినట్లు పట్టణంలోని ఈద్గా వద్ద మౌలానా ముస్తాక్ మదనీ తెలిపారు. ముస్లింలు బంధుమిత్రులతో కలిసి ఈద్ ఉల్ ఫితర్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

● మనుబోలు : మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలను సోమ వారం ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలకు వెళ్ళి ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు ధాన ధర్మాలు చేశారు. ముస్లింలకు రంజాన్ అత్యంత పవిత్రమైనదని ఇమామ్ అమానుల్లా తెలిపారు.

● వెంకటాచలం : మండలంలోని ముస్లింలు సోమవారం రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కసుమూరు ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేశారు. వెంకటాచలం, గొలగమూడి, కనుపూరు, పూడిపర్తి, సర్వేపల్లి తదితర గ్రామాలలోని మసీదులలో ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా కసుమూరు మస్తాన్‌వలి దర్గాలో పడమటి వాకిలి తెరిచారు. ఈ వాకిలి గుండా దర్గాలోకి వెళ్లి మస్తాన్‌వలి సమాధిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో పడమటి వాకిలి గుండా భక్తులు దర్గాలోకి వెళ్లి ప్రార్థనలు చేశారు.

● కోవూరు : రంజాన్‌ను సోమవారం మండల పరిధిలోని గ్రామాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక తక్యా మసీదు, సత్రం వీధిలోని మసీదుల్లో ప్రత్యేక పూజలు చేశారు. మత ప్రబోధకులు రంజాన్ మాస విశిష్ఠతను వివరించారు. పోతిరెడ్డిపాళెంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమూరు అశోక్‌రెడ్డి, యద్దలపూడి నాగరాజు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

● బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీ, మండలంలో ముస్లింలు రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు. దీంతో మసీదులలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు దానధర్మాలు చేశారు. బంధువులు, ఆత్మీయులు, స్నేహితులకు ప్రత్యేక ఆతిథ్యం ఇచ్చారు.

ముత్తుకూరులో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు





మనుబోలు : మతగురువు బోధనలు ఆలకిస్తున్న ముస్లింలు

ప్రమాదకరంగా ప్రయాణం

- స్టోన్‌హౌస్‌పేటలో పైపులైన్ల పనులు
- కనిపించని ప్రమాద సూచికలు

నెల్లూరు(క్రైం), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో కిరణా సరుకుల కొనుగోలుకు నిత్యం వేలాదిమంది ప్రజలు, వ్యాపారులు వస్తుంటారు. నవాబుపేట, మూడోమైలు, నార్రాజుపాలెం, నరుకూరు ప్రాంతాలకు వెళ్లే వాహనాలు కూడా ఈ ప్రాంతమీదుగానే వెళుతుంటాయి. దీంతో ఈ రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. కొద్ది రోజులుగా ప్రధాన రహదారిలో కన్యకాపరమేశ్వరి ఆలయం వైపు పైపులైను పనులు జరుగుతున్నాయి. దీంతో సగానికి రోడ్డును తవ్వేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. పనులు జరుగుతున్న రోడ్డులోనే దుకాణాల ఎదుట ద్విచక్ర వాహనాలు, ఆటోలు పార్కింగ్ చేస్తున్నారు. దీంఠ వాహన రాకపోకలు పూర్తిగా నిలిచి పోతున్నాయి. ఇదిలా ఉంటే తవ్విన గుంతలను పూర్తిగా పూడ్చకపోవడంతో ఆ గుంతల్లో వాహనాలు దిగబడిపోయి ఇరుక్కుపోతున్నాయి. పనులు జరుగుతున్న సమయంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇప్పటికైనా అధికారుల ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయడంతోపాటు వాహనాలను దారి మళ్లించాలి. అలాగే దుకాణాల ముందు వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలి.



స్టోన్‌హౌస్‌పేటలో జరుగుతున్న పైపులైన్ పనులు



రోడ్డు మధ్య గుంతలో ఇరుక్కున్న కారు

గుట్టుగా సింగిల్ నెంబర్లాట!

- తెలిసినా పట్టించుకోని పోలీసులు
- స్థానిక నేతల అండతో జోరుగా జూదం
- చితికిపోతున్న పేద, మధ్య తరగతి ప్రజలు



నెల్లూరు(క్రైం), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా సింగిల్ నెంబర్లాట సాగుతోంది. పలు రాష్ట్రాల్లో ఈ జూదం చట్టబద్ధమైనా రాష్ట్రంలో మాత్రం నిషేధం. ఇతర రాష్ట్రాల్లో అనుమతులకు అనుగుణంగా రోజుకోసారి సింగిల్ నెంబర్లాటకు సంబంధించిన నెంబర్లను విడుదల చేస్తుంటే జిల్లాలో మాత్రం అనధికారకంగా గంటకోసారి నెంబర్లను ఆఫ్‌లైన్‌లో విడుదల చేస్తూ పేద, మధ్య తరగతుల వారి జీవితాలతో ఆడుకుంటున్నారు.

● సింగిల్ నెంబర్లాట అంటే

సింగిల్ నెంబర్లాట గతంలో ఓ వెలుగు వెలిగింది. పాత తరం వారికి సింగిల్ నెంబర్లాట గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. నల్లనేరం, కోయిల్, సింగిల్ నెంబర్లు, సరోజ.. ఇలా పలు విధాలుగా లాటరీ విధానం రూపు మారుతూ వచ్చింది. సింగిల్ నెంబర్లాట లో ఓ నెంబరుపై రూ.100 బెట్టింగ్ కాస్తే ఆ నెంబరు తగిలితే పది రెట్లు అంటే రూ.1000 నగదు ఇస్తారు. ఇలా ఈ ఆట జిల్లాలో ఉదయం 9.45 నుంచి సాయంత్రం 6.45 గంటల వరకు ప్రతి గంటకు నెంబర్లను విడుదల చేస్తున్నారు.

● చితికిపోతున్న పేద, మధ్య తరగతి వారు

సింగిల్ నెంబర్లాటను ఎక్కువగా రోజూవారి కూలీలు, చిరు వ్యాపారులు, రోడ్డు పక్కన దుకాణాలు నిర్వహించేవారు... ఇలా పేద, మధ్య తరగతి వారే అధికంగా ఆడుతూ బానిసలుగా మారుతున్నారు. రూ.100 ఆటలో పెట్టి పది రెట్లు గంటలో సంపాదించాలన్న ఆశ.. ఈ ఆటకు సామాన్యులను బానిసలుగా చేస్తుంది. వంద మంది సింగిల్ నెంబర్లాటలో పందేలు కాస్తుంటే ఒక్కరు, ఇద్దరికి నగదు వస్తుంటుంది. వారికి వచ్చిందే మనకు వస్తుందన్న ఆశతో పేద, మధ్య తరగతి ప్రజలు ఈ ఆటను రోజూ ఆడుతూ కష్టపడి సంపాదించిన నగదును సింగిల్ నెంబర్లాటలో పెడుతూ నష్టపోతున్నారు.

● కన్నెత్తి చూడని పోలీసులు

గతంలో నగర డీఎస్పీ ఆధ్వర్యంలో సింగిల్ నెంబర్లాటపై ప్రత్యేక బృందం దాడులు నిర్వహించారు. ఆ సమయంలో నగరంలోని ఈద్గమిట్ట, ములుముడి బస్టాండు సెంటర్, రాజేంద్ర నగర్, నక్కలోళ్ల సెంటర్, రంగనాయకుల పేట, ఏసీనగర్, చిల్డ్రన్స్‌పార్క్ ప్రాంతం, వెంగళరావునగర్, వెంకటేశ్వరపురం, డైకాస్‌రోడ్డు, జెండావీధి, కోట మిట్ట, గిడ్డంగివీధి సెంటర్, స్టోన్‌హౌస్ పేట సెంటర్... ఇలా నగరంలోని పలు ప్రాంతాల్లో విచ్చలవిడిగా సింగిల్ నెంబర్లాట నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. స్థానిక పోలీసులకు సింగిల్ నెంబర్లాట గురించి పూర్తి స్థాయిలో సమాచారం ఉన్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని సమాచారం. ఇక అప్పుడప్పుడు సింగిల్ నెంబర్లాట ఆడించే వారిని కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నా స్థానిక నాయకుల నుంచి ఫోన్లు వస్తుండటంతో పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.


ఔరా..అనిపించేలా రితీష్ ప్రతిభ !

- ఎక్కడ నుంచైనా ఎలక్ట్రానిక్స్ వస్తువులను ఆపరేట్ చేసేలా సాంకేతికత రూపకల్పన
- తక్కువ ఖర్చుతో పరికరాల తయారీ
- ఫైనలియర్ బీటెక్‌లోనే అద్భుతాలు

ప్రతిభ PRATIBHA



పొదలకూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన శివాడ రితీష్‌రెడ్డి అనే యువకుడు తయారు చేసిన సైన్స్ పరికరాలను పరిశీలిస్తే ఎవరికైనా ఔరా.. అనిపించక మానదు. దేశంలో ఎక్కడి నుంచైనా తన ఇంటిలోని ఏసీ, గీజర్, మిక్సీ, ఫ్రిడ్జ్ లాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను ఆపరేట్ చేయవచ్చు. ఆలోచించే తెలివితేటలు, ఆసక్తి, ఆశయం, లక్ష్యం ఉంటే... ఇలాంటివి ఎన్నో రూపొందించవచ్చని నిరూపించాడు రితీష్‌రెడ్డి. తన ఆలోచనలకు పదును పెట్టి, తక్కువ ఖర్చుతో దైనందిన జీవితంలో ఉపయోగపడే వివిధ సాధనాలను తయారు చేసి పలువురితో శభాష్ అనిపించుకుంటున్నాడు. ఆ యువకుడిది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు శ్రీధర్ రెడ్డి, సునీత. రితీష్ ఓవైపు వ్యవసాయం చేసుకుంటూనే మరోవైపు పొదలకూరులో కేఫ్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. యువకుడు తయారు చేసిన స్మార్ట్ హోమ్ అప్లికేషన్ సాధనం ప్రతి కుటుంబానికి ఉపయోగపడుతోంది. ఇంట్లో ఏసీ, గీజర్, మిక్సీలాంటి వాటిని ఆన్ చేసి, ఆఫ్ చేయడం మర్చిపోయి ఎక్కడికైనా వెళ్లినా, అక్కడ నుంచే మొబైల్ ఫోన్ సాయంతో ఆఫ్ చేసే అవకాశం ఉంది. అలాగే మార్కెట్‌లో దొరికే చిన్న చిన్న వస్తువులతో మోషన్ సెన్సార్ లైట్ రూపొందించాడు. మనిషి కదలికలను బట్టి లైట్ వెలగడం, ఆగిపోవడం జరుగుతుంది. కోడి పొదుగు లేకుండానే గుడ్లను పిల్లలుగా మార్చేందుకు ఎగ్ ఇంక్యుబేటర్‌ను తయారు చేశాడు. అలాగే సోలార్ వైర్‌లెస్ సోలార్ కారు, ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ సిస్టంను రూపొందించాడు. దీని ద్వారా వివిధ రకాల ఎలక్ట్రికల్ వాహనాలకు రన్నింగ్‌లోనే చార్జింగ్ చేసుకునే అవకాశం ఉంది. రితీష్ విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈసీఈ ఫైనల్ ఇయర్ చదువుతు న్నాడు. వివిధ ప్రయోగాల ఆవిష్కరణలో తన ప్రొఫెసర్ డాక్టర్ పీ.మోహనయ్య, తనకు సహకరిస్తున్నాడని రితీష్ తెలిపారు. సరికొత్త ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే వివిధ రకాల ఆవిష్కరణలను రూపొందిస్తున్న రితీష్ పలువురి అభినందనలు అందుకుంటున్నారు.



వైర్‌లెస్ సోలార్ కారు



ఎగ్ ఇంక్యుబేటర్



రితీష్‌రెడ్డి తయారు చేసిన స్మార్ట్ హోమ్ అప్లికేషన్

పెద్ద లోటు

తుమ్మలకు సాహిత్య వర్గాల నివాళి

కుప్పం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ వర్సిటీ మాజీ వీసీ, కథారచయిత తుమ్మల మరణంపై వర్సిటీ వర్గాలు, సాహిత్య వర్గాలు సంతాపం ప్రకటించాయి. ఆయన సాహిత్య కృషినీ, తమ అనుబంధాన్నీ పలువురు గుర్తు చేసుకుంటున్నారు.

ఆయన రాయాల్సింది ఇంకా చాలానే ఉంది. రాస్తాననీ చెప్పాడు. భోళా మనిషి. వృత్తి కథలకు దారి చూపి వెళ్లిపోయాడు. గొప్ప స్నేహశీలిని కోల్పోయాం.

- మధురాంతకం నరేంద్ర, కథా రచయిత

1980లలో ఎస్వీయూనివర్సిటీ ఎఫ్ బ్లాక్‌లో తుమ్మల రామకృష్ణతో మొదలైన పరిచయం నాతో సహా సాహిత్య వర్గాలకు గట్టి స్నేహంగా మారింది. మా అందరిలోకీ చిన్నవాడు. అందరం చినబ్బా అని పిలిచేవాళ్లం. ఆయన లేడంటే నమ్మలేకున్నాం.

-ప్రొఫెసర్ డి.కిరణ్ క్రాంత్ చౌదరి

ఆయన లేని లోటు బహుజన సాహిత్యాన్ని ఎక్కువగా బాధిస్తుంది. ఆయన కథలు 'అడపం మేలుకొంది', 'మహా విద్వాంసుడు' బహుజన సాహిత్యానికి ప్రతీకలుగా నిలిచాయి.

- శ్రీదేవి, ద్రావిడ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆచార్యులు

చదువుకునే రోజుల్లో గాంధీరోడ్డులోని డీలక్స్ హోటల్ గురువు కేతు విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో సాహిత్య చర్చలు జరిగేవి. తుమ్మల క్రియాశీలి. ఒక చిన్న పల్లె నుంచి బీసీ నేపథ్యం నుంచి వచ్చి హైదరాబాదు సెంట్రల్ వర్సిటీ ఆచార్యుడుగా చేరి, ఒక వర్సిటీ వైస్ చాన్సలర్ అయ్యాడు. గొప్ప మిత్రుడిని కోల్పోయాం.

- డాక్టర్ వి.ఆర్.రాసాని, రచయిత

మూగబోయిన బహుజన స్వరం

ద్రావిడ మాజీ వీసీ, కథారచయిత తుమ్మల రామకృష్ణ మృతి



కుప్పం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి):తెలుగు కథా సాహిత్యంలో బహుజన స్వరాన్ని బలంగా వినిపించిన ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణ మృతి, సాహిత్య వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేసిన ఈయన సోమవారం ఉదయం హైదరాబాదులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో ఆఖరి శ్వాస విడిచారు. కథా రచయితగా ప్రసిద్ధుడైన ఆచార్య తుమ్మల రామకృష్ణ స్వస్థలం చిత్తూరు జిల్లా సోమల మండలం ఆవులపల్లె గ్రామం. పెద్దఉప్పరపల్లె, నెరబైలు గ్రామాలలో హైస్కూలు దాకా చదువుకున్న ఆయన ఇంటర్మీడియట్ తిరుపతిలో చదువుకున్నారు. శ్రీవేంకటేశ్వర విద్యాలయంలో ఎంఫిల్, పీహెచ్‌డీ తీసుకునేదాకా ఉన్నత విద్యాభ్యాసం సాగింది. హైదరాబాదులోని సెంట్రల్ యూనివర్సిటీలో తెలుగు ఆచార్యుడిగా పదవీ విరమణ చేసిన తర్వాత ద్రావిడ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా 2020లో నియమితులయ్యారు. 2023, నవంబరు 25న ఇక్కడే పదవీ విరమణ చేశారు. ద్రావిడ యూనివర్సిటీ రాజకీయాల్లో ఆయన నలిగిపోయారు. ఈ సమయంలోనే అనారోగ్యానికి కూడా గురయ్యారు. హైదరాబాదులోని లింగంపల్లిలో ఉంటూ చికిత్స తీసుకునేవారు.

బహుజన కెరటం: తుమ్మల కలం బహుజన ధిక్కార స్వరం. 'అడపం మేలుకొంది' అన్న తుమ్మల కథ చిత్తూరు జిల్లా ఊళ్లల్లో నేటికీ మారని బహుజనుల జీవితాల వేదన తెలియజేస్తుంది. తుమ్మల రామకృష్ణ రాసిన 'మహా విద్వాంసుడు' కథ - సంగీతంలోని వివక్షను ఎత్తి చూపుతుంది. ఊబి, ఊరిమధ్యస్తం, ఓ సాయంత్రం, డాక్టర్ గుర్నాథం, పరాభవం, రాలిన చింత, రేగడిమిట్ట, స్పెషల్ స్క్వాడ్ వంటి కథలతో 'మట్టిపొయ్యి' సంపుటి ప్రచురించారు. తెల్ల కాకులు అనే కథను పుస్తకంగా ప్రచురించారు. ఇది అనేక భాషల్లోకి అనువాదం అయ్యింది. కర్నూలులో కథా సాహిత్య వాతావరణాన్ని పునరుజ్జీవింపజేసిన కథకుడిగా తుమ్మలను గుర్తిస్తారు. ఇక్కడి నుంచి ఆయన చొరవతో వచ్చిన 'పల్లెమంగలి కథలు' తెలుగు కథాసాహిత్యంలో బహుశా తొలి వృత్తి కథల సంకలనం. ఆయన సారథ్యంలోనే అడపం పేరుతో వృత్తి కథల సంకలనం వెలువడింది. 'పరిచయం', 'బహుముఖం', 'అవగాహన' వ్యాస సంపుటాలు, 'అభిచందనం' పేరుతో సమీక్షలు - ప్రసంగాలు పుస్తకాలుగా వెలువడ్డాయి. ఆయన రచనలు అనేకం తమిళ, కన్నడ, మలయాళ భాషలతో పాటూ మరాఠీ, హిందీ, ఇంగ్లీషుల్లోకీ అనువాదం అయ్యాయి. ఆయన సాహిత్య కృషిపై పలువురు రాసిన వ్యాసాలతో 'సీమ సంతకం' అనే పుస్తకం వెలువడింది. ఎనభైల తర్వాత ఊపందుకున్న అస్తిత్వ ఉద్యమాల జాడలు తుమ్మల రామకృష్ణ రచనల్లో కనిపిస్తాయి. స్వయంగా ఒక బహుజనునిగా పొందిన అనుభవాలు, సంవేదనల ప్రతిధ్వనులు వినిపిస్తాయి. ఆయన ఎలుగెత్తిన బహుజన ధిక్కార స్వరం ఇంకా గట్టిగా, వేయిగొంతుకుల పెట్టుగా ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది.



చేతి వేళ్ల రాతలు కాస్త అరిగినా.. చిన్నపాటి సాంకేతిక సమస్య తలెత్తినా వేలిముద్రలు పడేవి కావు. దీంతో పింఛన్ల కోసం వృద్ధులు.. సచివాలయ సిబ్బంది నిరీక్షించే వారు. దీనికి పరిష్కారంగా రాష్ట్ర ప్రభుత్వం ఎల్-1 డివైజ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటి ద్వారానే మంగళవారం నుంచి పింఛన్లను పంపిణీ చేయనున్నారు.

పింఛనుదారులకు 'సాంకేతిక' భరోసా

- ఎల్-1 ఆర్డీ పరికరాలతో వేలిముద్ర సమస్యకు పరిష్కారం
- వీటితోనే నేటి నుంచి పింఛన్ల పంపిణీ

వైసీపీ ప్రభుత్వంలో పింఛన్ల పంపిణీకి ఎల్-0 ఆర్‌డీ పరికరాలను సచివాలయ సిబ్బందికి ఇచ్చారు. ఇవి సరిగా పనిచేయలేదని పలుమార్లు ఫిర్యాదుచేసినా అప్పట్లో పట్టించుకోలేదు. వేలిముద్రలు పడకపోవడంతో గంటల కొద్దీ పండుటాకులు వేచి ఉండాల్సి వచ్చింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన ఎల్-1 ఆర్‌డీ పరికరాలను యూఐడీఏఐ (యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) ఆధార్ సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానించారు. దీనిపై గీతలు పడినా, తేమ ఉన్నప్పటికీ వేలిముద్రలను నాణ్యతగా స్కాన్ చేస్తుంది. అలాగే అక్రమాలకూ చెక్ పెడుతుంది. కొన్ని రాష్ట్రాల్లో నకిలీ వేలిముద్రలను రూపొందించి పింఛన్లను పక్కదారి పట్టిస్తున్నారన్న ఫిర్యాదులు యూఐడీఏఐకి చేరాయి. ఈ నేపథ్యంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఎల్-1 పరికరాలను కొనాలని కేంద్రం సూచించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 5,264 పరికరాలు పంపింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఎల్1 ఆర్డీ స్కానర్లను అన్ని సచివాలయాలకు పంపామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆధార్ అనుసంధానంతో కూడిన ఈ పరికరం పింఛనుదారులకు సాంకేతిక భరోసాలాంటిదన్నారు. వీటి ద్వారా ఎటువంటి లోపాలకు తావులేకుండా వేలిముద్రలు పడతాయని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారులు నారాయణరెడ్డి, కోఆర్డినేటర్ జగదీష్ సోమవారంరాత్రి తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి ఎల్-1 పరికరాల ద్వారా 2,61,841 మందికి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేయన్నారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

ఒకటో సారి.. రెండో సారి.. మూడో సారి..!



- పారదర్శక టెండర్లతో తిరుపతి కార్పొరేషన్‌కు పెరిగిన ఆదాయం
- వైసీపీ హయాంలో గుట్టుచప్పుడు కాకుండా నొక్కుడు
- ఒక్క మార్కెట్లోనే రూ.రెండు కోట్లకుపైగా వ్యత్యాసం

తిరుపతి, ఆంధ్రజ్యోతి

వైసీపీ జమానాలో చిన్నా చితకా వాటికి కూడా టెండర్లు గోప్యంగా జరిగిపోయేవి. ముఖ్యంగా తిరుపతి కార్పొరేషన్‌లో జరిగే టెండర్లలో గోల్‌మాల్ అంతా ఇంతా కాదు. బహిరంగ వేలం పేరు పెట్టి 'ఒకటోసారి.. రెండోసారి.. మూడోసారి..' అనే మాటలు లేకుండానే పనికానిచ్చేశారు. వేలంలో బయటవారు రాలేరు. వద్దామంటే అసలు టెండరు ఎప్పుడు జరుగుతుందో తెలియదు. తెలుసుకునేలోపు నాలుగు గోడల మధ్య చీటీలు వేసి పంచుకునేసేవారు. అన్న క్యాంటీన్లు మొదలకుని, కపిలతీర్థం సర్కిల్ మెరిడియన్ హోటల్ వరకు, స్క్రాప్ టెండర్ నుంచి మార్కెట్ టెండర్ల వరకు, ఇంజనీరింగ్ పనులైతే ఏకనిరంజన్ పనికానిచ్చేవారు.

తాజాగా కార్పొరేషన్ పరిధిలో జరిగిన టెండర్లను పరిశీలిస్తే వైసీపీ హయాంలో అడ్డగోలుతనం బయటపడింది. 2024 వరకు ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ టెండరు రూ2.58కోట్లు మాత్రమే. కూటమి అధికారంలోకి వచ్చాక జీఎస్టీతో కలిపి దాదాపు రూ.5 కోట్లకు ధర పలికింది. పాలకపక్షం పారదర్శకంగా టెండర్లు నిర్వహిస్తే మార్కెట్ అసలు ధర ఎంతో ఇప్పుడు బయటపడింది. అంటే గత వైసీపీ పాలనలో ఒక్క మున్సిపల్ మార్కెట్ పైనే ఏడాదికి రూ.2 కోట్లకుపైగా కార్పొరేషన్ ఆదాయానికి గండి పడిందంటే తక్కినవాటిలో ఎంత నొక్కేసారో అర్థం చేసుకోవచ్చు.

పార్కింగ్ అడ్డాలనూ దోచేశారు

తిరుపతిలోని పార్కింగ్ ప్రదేశాలనూ వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా దోచేశారు.

- 2022-23లో భారతి బస్టాండు పార్కింగ్ టెండరు రూ3.37లక్షలు. 2023-24కు దీనిని రూ2.23లక్షలకు తగ్గించి కట్టబెట్టారు. ఇదే బస్టాండుకు 2024-25లో రూ7.12లక్షలు, తాజాగా రూ10.40లక్షలు ధర పలికింది. అంటే వీటినుంచీ కార్పొరేషన్ ఆదాయానికి వైసీపీ హయాంలో గండికొట్టేశారు.
- జీఎస్ మాడవీధి పార్కింగ్ స్థలాలు టెండరులోనూ భారీ వ్యత్యాసం కనిపించింది. వైసీపీ హయాంలో రూ1.25లక్షలు ఉన్న మాడావీధి టెండరు ప్రస్తుతం రూ3.35లక్షలతో రెండింతలు పలికింది.

రాజకీయ జోక్యం లేకపోవడంతో..

కార్పొరేషన్ పరిధిలో జరిగే టెండర్లలో రాజకీయ జోక్యం లేకపోవడం వల్లే పారదర్శకంగా బహిరంగ వేలం నిర్వహించడంతో భారీగా ఆదాయం సమకూరింది. గతంలో వైసీపీ పెద్దలు చెప్పినట్టే అధికారులు తలలు ఆడించడంతో అయినవారికి కార్పొరేషన్ ఆస్తులను చౌకగా కట్టబెట్టేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో జన బాహుల్యంలో ఉన్న పత్రికలకు ప్రకటనలు ఇచ్చి విస్తృత ప్రచారం చేసి టెండరు నిర్వహించడం వల్ల పాట దారుల్లో పోటీతత్వం పెరిగినట్టు కనిపిస్తోంది.

నాడు- నేడు వేలం పాటల వివరాలు

	కూరగాయల మార్కెట్	రామచంద్రగుంట కట్ట	జంతువధశాల	చిన్నవీధులు	భారతీ బస్టాండ్ పార్కింగ్ స్థలాలు	జీఎస్ మాడవీధి పార్కింగ్ స్థలాలు
2022-23	రూ. 2,30,40,000	రూ. 1,94,000	రూ. 3,18,600	రూ. 14,32,000	రూ. 3,27,000	----------------
2023-24	రూ. 2,58,05,700	రూ. 2,15,554	రూ. 4,17,672	రూ. 15,90,948	రూ. 2,52,924	రూ. 1,25,676
2024-25	రూ. 4,81,50,000	రూ. 2,32,500	రూ. 4,27,500	రూ. 19,57,500	రూ. 7,12,500	రూ. 1,39,800
2025-26	రూ. 4,76,00,000	రూ. 2,34,000	రూ.4,00,000	రూ. 33,00,030	రూ. 10,40,000	రూ. 3,35,599



భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

రంజాన్ సందర్భంగా జిల్లా అంతటా ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో నమాజ్ చేశారు. నెల రోజుల ఉపవాస దీక్షలను పూర్తి చేసుకున్న వీరు ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం పిల్లలు, పెద్దలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలువురు ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నాయకులు వెళ్లి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు చెప్పారు. వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో రద్దు చేయాలని కోరుతూ కొందరు నల్లబ్యాడ్జీలతో ప్రార్థనల్లో పాల్గొన్నారు.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

చిన్నపొరపాటు చేసినా నో ఎంట్రీ

- 2 గంటల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి
- రేపటి నుంచి జేఈఈ మెయిన్స్

తిరుపతి(విద్య), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌కు సన్నద్ధం కావడమే కాదు.. పరీక్షలకు వెళ్లే ముందు ఏ చిన్న పొరబాటూ జరగకుండా అప్రమత్తంగా ఉండాలి. లేదంటే పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్ పరీక్షలు మంగళవారం నుంచి 9వ తేదీ వరకు జరుగనున్నాయి. పేపర్-1 పరీక్ష ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా (బీఈ, బీటెక్) జరుగుతుంది. 9వ తేదీ ఉదయం పేపర్-2ఏ (బీఆర్క్) పరీక్ష, పేపర్-2బీ ప్లానింగ్ పరీక్షలు జరుగుతాయి. గతంలోనే మొదటి సెషన్ మాదిరిగానే కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో ఆన్‌లైన్ పరీక్షలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ఎన్‌టీఏ నిబంధనలను తప్పకుండా అనుసరించాలి. అడ్మిట్ కార్డులోనూ వాటిని పొందుపరిచారు.

- నిర్దేశిత సమయానికి రెండు గంటలు ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్ష సమయానికి అరగంటముందే కేంద్రంలోకి అనుమతిస్తారు.
- సాధారణ వస్త్రాలనే ధరించాలి. ఆభరణాలు, వాచీలు ధరించకూడదు. సాధారణ చెప్పులనే వేసుకోవాలి.
- బ్లూ, బ్లాక్ కలర్ బాల్‌పాయింట్ పెన్నులను తీసుకువెళ్లాలి.
- ట్రాన్స్‌పరెంట్ వాటర్ బాటిల్‌నే అనుమతిస్తారు.
- దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన ఆధార్, పాన్ తదితర ఒరిజినల్ ఐడెంటిటీ కార్డులను వెంట తీసుకెళ్లాలి.
- ఎన్‌టీఏ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డు కింది భాగంలో సూచించిన బాక్సులో కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను అతికించాలి. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన ఫొటోనే ఇక్కడా అతికించాలి.
- ఆ పక్కనే ఉన్న మరో బాక్స్‌లో విద్యార్థి ఎడమ చేతి వేలిముద్ర వేయాలి.
- మూడో బాక్సులో పరీక్ష కేంద్రంలోకి వెళ్లాక ఇన్విజిలేటర్ సమక్షంలో సంతకం చేయాలి.
- విద్యార్థి అడ్మిట్ కార్డుతోపాటు అటెండెన్స్ షీట్‌పై అతికించేందుకు మరొక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను తీసుకువెళ్లాలి.

తనిఖీల్లేకుండా 'కొండ'కు అనుమతించకండి

'అలిపిరి'లో అప్రమత్తంగా ఉండాలి • తిరుమల భద్రతపై పోలీసు, విజిలెన్సు అధికారులతో ఎస్పీ సమీక్ష



తిరుపతి(నేరవిభాగం), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల భద్రతపై ఎస్పీ హర్షవర్ధనరాజు ఫోకస్ పెంచారు. 'అలిపిరి' వద్ద తనిఖీల్లేకుండా తిరుమలకు అనుమతించొద్దని.. టోల్‌గేటు వద్ద అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సోమవారం ఉదయం ఓ యువకుడు అలిపిరి చెక్‌పాయింట్‌లోని వీఐపీ లైను గుండా బైకులో దూసుకెళ్లగా.. జీఎన్సీ టోల్‌గేటు వద్ద అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ విజయశేఖర్, టీటీడీ వీజీవో రాంకుమార్, అలిపిరి ఏవీఎస్‌వో రాజశేఖర్, సిబ్బందితో ఎస్పీ దాదాపు రెండు గంటల పాటు సమీక్షించారు. ద్విచక్రవాహనంపై వేగంగా వస్తున్న భక్తుడిని ఎందుకు గుర్తించలేక పోయారని ఎస్పీ ప్రశ్నించినట్లు తెలిసింది. వీఐపీ దారిలో ఎంతమంది డ్యూటీలో ఉన్నారని తెలుసుకున్నారు. ఆపినా.. ఆపకుండా సిబ్బందిపైకి దూసుకొంటూ రావడంతో తప్పించుకుని వెళ్లడానికి కారణమైందని ఎస్పీకి అధికారులు వివరించినట్లు సమాచారం. అలిపిరి టోల్‌గేటు వద్ద మరింత అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పటిష్ఠ తనిఖీలతో నిషేధిత వస్తువులు.. పదార్థాలకు అలిపిరి వద్దే అడ్డుకట్ట వేయాలన్నారు.

చిన్న పిల్లలు, వృద్ధులు మిస్సింగ్‌పై ఆరా

తిరుమలలో తరచూ వృద్ధులు, చిన్నపిల్లలు తప్పిపోవడం, కిడ్నాప్‌కు గురవడంపైనా ఎస్పీ హర్షవర్ధనరాజు ఆరా తీశారు. దీనికోసం ఆలయ ప్రధాన ద్వారం వద్ద సమాచార కేంద్రం ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే దానిపై అధ్యయనం చేయాలన్నారు. యాత్రికులు తప్పిపోతే వెంటనే గుర్తించేలా టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు చేయడంపైనా చర్చించినట్లు తెలిసింది. గత ఐదేళ్లలో 400 నుంచి 450 మంది పిల్లలు, 400 మంది వృద్ధులు తప్పిపోగా 75 శాతం మందిని గుర్తించి వారి కుటుంబీకులకు అప్పగించారు. ఈ క్రమంలో చిన్నపిల్లలకు అలిపిరి వద్దే ట్యాగ్‌లు వేయడం.. వృద్ధుల కోసం యాప్ రూపొందించడంపైనా సమీక్షించినట్లు సమాచారం. తిరుమలలో అనధికార వ్యక్తుల నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

మార్కెట్ యార్డ్ ఏర్పాటు కలేనా?



15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బోర్డు

దొరవారిసత్రం, మార్చి31 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రంలో మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు మోక్షం లభించడంలేదు. 15 ఏళ్ల క్రితం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పక్కన జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పది ఎకరాల ప్రభుత్వ భూమిని మార్కెట్ యార్డ్‌కు కేటాయించారు. ఆ స్థలంలో బోర్డు కూడా ఏర్పాటు చేశారు. తరువాత అడుగు ముందుకు పడలేదు. మండలంలో వరితో పాటు మిర్చి, వేరుశనగ పంటలను ఎక్కువగా సాగు చేస్తారు. పంట ఉత్పత్తులను దాచుకుని మద్దతు ధర లభించినప్పుడు అమ్ముకోవడానికి మార్కెట్ యార్డ్ ఎంతో అవసరం. రైతులు ధాన్యం దాచుకోవడానికి తంటాలు పడుతున్నారు. గత్యంతరం లేక దళారులు చెప్పిన రేటుకే విక్రయించి నష్టపోతున్నారు. ప్రజాప్రతినిధులు చొరవ చూపి మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

పూలతోటలో పోలీసుల పల్లెనిద్ర



గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అజయ్‌కుమార్

దొరవారిసత్రం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలతోట గ్రామంలో ఆదివారం రాత్రి దొరవారిసత్రం ఎస్‌ఐ అజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది పల్లెనిద్ర చేశారు. కొత్త వాహన చట్టాలు, శక్తి యాప్, సైబర్ క్రైం, రోడ్డు ప్రమాదాలు, ఇళ్లకు స్మార్ట్ లాక్, డయల్ 100, 112 నెంబర్ల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

కమనీయం... వెంకటేశ్వరస్వామి కల్యాణం



వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కోట, ఆంధ్రజ్యోతి మార్చి 31: మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్త పాలెంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం తెల్లవారు జామున స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ ధర్మకర్త నేదురమల్లి ప్రసేన్‌కుమార్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరుడి కల్యాణాన్ని వేద పండితులు అనంతాచార్యులు భక్తుల సమక్షంలో జరిపారు.

రేపటి నుంచి కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

తిరుపతి(కల్చరల్), మార్చి 31(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 2వ తేదీ నుంచి కంప్యూటర్ శిక్షణ ప్రారంభించనున్నట్లు కేంద్ర నిర్వాహకులు పి.ముఖేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ట్యాలీ, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు, 6 నుంచి 8 గంటల వరకు ఎంఎస్ ఆఫీస్, వర్డ్, ఎక్సెల్ తదితర కోర్సుల్లో నామమాత్రపు రుసుంతో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిక్షణకు 7వ తరగతి పూర్తయి ఉండాలని, వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వృత్తుల వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకురావాలని, వివరాలకు 9966584759, 8985080370లను సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీలో పదోన్నతులు కల్పించాలి

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా పెండింగులో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులను వెంటనే చేపట్టాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి.దామోదరరావు, నరసయ్య డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతిలో వారిరువురు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని, 11వ పీఆర్సీకి సంబంధించిన బకాయిలు, డీఏ, సరండర్ లీవ్ నగదు చెల్లించాలని కోరారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలన్నారు. 2021 నుంచి రిటైరైన ఆర్టీసీ ఉద్యోగులకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఎంప్లాయీస్‌కు హెల్త్‌స్కీమ్ అమలు చేస్తూ జీవో విడుదల చేసినా ఆరోగ్యశ్రీ నుంచి ఆదేశాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కొర్లగుంట మారుతీనగర్‌లో చోరీ

160 గ్రాముల బంగారు, 60 గ్రాముల వెండి అపహరణ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 31(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని కొర్లగుంట మారుతీనగర్‌లో ఆదివారం రాత్రి దొంగలుపడ్డారు. 160 గ్రాముల బంగారు నగలు, 60 గ్రాముల వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. క్రైం సీఐ ప్రకాష్ చెప్పిన వివరాల మేరకు.. కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన నాగార్జున చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. బ్యాంకులో భద్రపరచిన 160 గ్రాముల బంగారు నగలు, 60 గ్రాముల వెండి ఆభరణాలను ఉగాది సందర్భంగా విడుదల చేయించి, ఇంట్లోని బీరువాలో భద్రపరిచాడు. పండుగ కావడంతో కుటుంబ సమేతంగా విద్యానగర్‌లో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకెళ్లాడు. ఈ విషయాన్ని గమనించిన దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉంచిన బంగారు నగలు, వెండి ఆభరణాలు అపహరించుకెళ్లారు. ఆదివారం సాయంత్రం ఇంటికొచ్చిన నాగార్జున ఇంటి తలుపులు తెరచి ఉండడం గమనించి లోనికెళ్లి చూశాడు. నగలు కనిపించకపోవడంతో ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు సీసీఎస్ పోలీసులకు కేసు రెఫర్ చేశారు. క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు, డీఎస్పీ శ్యాంసుందర్, సీఐ ప్రకాష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేయించారు. వేలిముద్రలు పరిశీలించారు. సీఐ ప్రకాష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీమద్రామాయణ ప్రవచనామృతం ప్రారంభం

తిరుపతి(టీటీడీ), మార్చి 31(ఆంధ్రజ్యోతి): శ్రీమద్రామాయణ ప్రవచనామృతాన్ని డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ సోమవారం ప్రారంభించారు. తిరుపతిలోని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, రామకృష్ణ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏప్రిల్ 6వ తేదీ వరకు సాగనుంది. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆశ్రమంలోని వివేకానంద సభా ప్రాంగణంలో జరుగుతుంది.

6 నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

తిరుపతి(టీటీడీ), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కోదండ రామాలయంలో 6 నుంచి 8వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించనున్నారు. 6న శ్రీరామనవమి, 7న సీతారాముల కల్యాణం, 8న శ్రీరామ పట్టాభిషేకం జరగనున్నాయి. 9న సాయంత్రం వసంతోత్సవం, 10 నుంచి 12వ తేదీ వరకు తెప్పోత్సవాలు నిర్వహించనున్నారు.

గంగమ్మ గ్రామోత్సవం

గూడూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా గంగమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక గంగమ్మ ఆలయం నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై ఉంచి మంగళ వాద్యాలు, తప్పెట్లు తాళాలు, యువత నృత్యాల నడుమ ఆదివారం రాత్రి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొనసాగిన గ్రామోత్సవం సోమవారం సాయంత్రం ఆలయం వద్దకు చేరుకుంది. గొల్లలు గంగపెట్టెను ఊరేగిస్తూ వీరతాళ్లతో నృత్యాలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



గ్రామోత్సవంలో గంగమ్మ

లో వోల్టేజ్ నివారణకు చర్యలు

సూళ్లూరుపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలో లో వోల్టేజ్ సమస్య తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. ఈ ఏడాది మార్చిలోనే ఎండలు తీవ్రంగా ఉండడంతో పాటు విద్యుత్ వినియోగం బాగా పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సూచన మేరకు డీఈఈ శేఖర్ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో అధికారులు పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు సన్నద్ధమయ్యారు. లో వోల్టేజ్ సమస్య ఉన్న చోట అదనంగా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో సూళ్లూరుపేట పట్టణం, రూరల్ ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ పార్టీ నాయకుల అజమాయిషీ భరించలేక విధి నిర్వహణకు ఎవరూ ముందుకు రాలేదు. బాధ్యతలు తీసుకొన్న వారు కూడా వారం రోజులకు మించి పనిచేయకుండానే బదిలీపై వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీగా ఉన్న సూళ్లూరుపేట పట్టణం, రూరల్ ఏఈ పోస్టులను భర్తీ చేసింది. ఎక్కడ చిన్నపాటి సమస్య వచ్చినా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వెంటనే సమస్యను పరిష్కరిస్తున్నారు. వేసవి కాలంలో గతంలో పట్టణంలో కరెంట్ సరఫరా సక్రమంగా ఉండేది కాదు. లో వోల్టేజ్ సమస్య లేకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సబ్ డివిజన్ పరిధిలో 15 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని డీఈఈ తెలిపారు. అదే విధంగా వ్యవసాయానికి సంబంధించి కూడా కొత్త విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సబ్ డివిజన్ పరిధిలో తడ మండలంలో తడ బీసీ కాలనీ, రైల్వేస్టేషన్, అయ్యప్పనగర్, ఓబాలమ్మ గుడి, తడ హరిజనవాడ, సూళ్లూరుపేటలో ఆర్‌అండ్‌బీ బంగ్లా, షార్ సర్కిల్ రోడ్డు, అంబేద్కర్ గురుకులం, కోటపోలూరు బీసీ కాలనీ, దేగలపాలెం, మన్నారుపోలూరు, కోళ్లమిట్ట తదితర ప్రాంతాలతో పాటు దొరవారిసత్రం మండలంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు చేపడుతున్నారు.



సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరులో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు (ఫైల్‌ఫొటో)

బ్యాంకు లింకేజీ రుణం... మహిళలకు వరం

● స్వయం ఉపాధితో ఆర్థిక భరోసా

పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి మార్చి 31: పేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం లభిస్తోంది. మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ రుణాలను అందిస్తుండడంతో ఆయా సంఘాల సభ్యులు స్వయం ఉపాధితో పొందుతున్నారు. చిరువ్యాపారాలు ప్రారంభించి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. పెళ్లకూరు మండలంలో 871 మహిళా సంఘాల్లో 9060 మంది సభ్యులు ఉన్నారు. నాలుగన్నరేళ్లలో మహిళా సంఘ సభ్యులు కోట్లాది రూపాయలు రుణాలు పొందారు. కిరాణా, చిల్లర వ్యాపారాలతో పాటు వస్త్రాల విక్రయం, టైలరింగ్ శిక్షణ కేంద్రాలతో పాటు వివిధ రకాల వ్యాపారాలు చేసుకోవడంతో పాటు పొదుపు నగదును వ్యవసాయ పెట్టుబడులకు వినియోగించుకుంటూ కుటుంబాలకు ఆసరగా నిలుస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి కింద 324 మహిళా సంఘాలు రూ.7.43 కోట్ల రుణాలు పొందగా, ఉన్నతి పథకం కింద 354 సంఘాలు రూ1.42 కోట్లు తీసుకున్నాయి. అదేవిధంగా బాంకు లింకేజీల ద్వారా 467 మహిళా సంఘాల సభ్యులు రూ.28.48 కోట్ల రుణం తీసుకున్నారు. ఈ రుణాలతో స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.



పొదుపు మహిళలతో సమావేశమైన వెలుగు సీసీలు

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గతంలో మాదిరి కాకుండా పొదుపు మహిళలకు ఏ అవసరం కోసం, ఎప్పుడు, ఎంత రుణం కావాలో తెలుసుకొని ఇవ్వనుంది. స్వయం ఉపాధికి అవసరమైన రుణం సకాలంలో అందివ్వడం ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధిలో ముందుడుగు వేస్తున్నారు.

\- హేమామాలిని, వెలుగు ఏపీఎం





వెంకటగిరి ఈద్ దర్గాలో ఎమ్మెల్యే కురుగొండ్ల ప్రార్థనలు - నాయుడుపేటలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

భక్తి శ్రద్ధలతో రంజాన్

గూడూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముస్లింలు రంజాన్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక నమాజు కట్ట, పెద్దమసీదు, నూర్‌మసీదు తదితర ప్రాంతాల్లో ముస్లిం మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్‌ముబారక్ తెలియజేసుకున్నారు. అదేవిధంగా చిన్న మసీదు, రాణిపేట, ఇందిరానగర్, గాంధీనగర్, వీరారెడ్డిపల్లి, బనిగిసాహెబ్‌పేట, మండల పరిధిలోని పోటుపాళెం, విందూరు, చెన్నూరు, తిప్పవరప్పాడు ప్రాంతాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వక్ఫ్‌బోర్డు రద్దు బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లింలు చేతికి నల్లరిబ్బన్లు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మసీదుల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పట్టణ సీఐ శేఖర్‌బాబు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

సూళ్లూరుపేట: మండలంలోని మన్నారుపోలూరులో ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఓజిలి: మండల కేంద్రమైన ఓజిలితో పాటు రాచపాళెం, ఆరిమేనిపాడు, కార్టిమేడు, అత్తివరం, కరబల్లవోలు, కురుగొండ గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని కౌవల్యా నది ఒడ్డున ఉన్న ఈద్గాలో ముస్లిం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వక్ఫ్‌బోర్డు రద్దును వ్యతిరేకిస్తూ నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు.

వెంకటగిరి: పట్టణంలోని ఈద్ దర్గాలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యేతో పాటు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, బీరం రాజేశ్వరరావు, పునుగోటి విశ్వనాధ నాయుడు, ఖరీముల్లా, మస్తాన్, అల్తాఫ్, గౌస్ పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకుడు నెలవల రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ తదితరులు రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

తడ: మండలంలోని పూడికుప్పం జాతీయ రహదారి వద్ద ఉన్న ఈద్గా, బీములవారిపాలెం వద్ద ఉన్న మసీదుల్లో ముస్లిం మతపెద్దలు హుస్సేన్, ఫక్రుద్దున్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

దొరవారిసత్రం: మండలంలోని వేణుంబాక గ్రామ శివారులో ఉన్న ఈద్గాలో ముస్లింలు మతపెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కోట: మండల కేంద్రంలోని జామా మసీదు, శ్యామసుందరపురంలోని ఈద్గా, నెల్లూరుపల్లి, గోవిందపల్లి, చంద్రశేఖరపురం గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు.

గరుడ వాహనంపై జగదానందకారకుడు





మోహినీ అవతారంలో శ్రీరామచంద్రమూర్తి - గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

తిరుపతి(టీటీడీ), మార్చి 31(ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు సోమవారం జగదానంద కారకుడు ఉదయం మోహినీ అవతారంలో పల్లకిలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. 9.30 గంటలకు గజరాజుపై గరుడ పాదుకలు ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగాయి. 10.30 నుంచి 11.30 గంటల వరకు సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామికి వేడుకగా స్నపన తిరుమంజనం సాగింది. రాత్రి 7 గంటల నుంచి గరుడ వాహనంపై ఆశీనులైన స్వామివారు ఆలయ నాలుగు మాఢ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు శ్రీరామ భజనలు చేస్తూ అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. వాహన సేవల ముందు కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేకంగా నిలిచాయి. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



కుటుంబసభ్యులతో సీతాదేవి

తిరుమల, మార్చి31(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మాజీ పీఎం వీపీ సింగ్ సతీమణి సీతాదేవి, సినీ నిర్మాత బండ్ల గణేష్, ఎమ్మెల్యే విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

రాస్ సేవలకు ఉగాది పురస్కారం

తిరుపతి(ఆటోనగర్), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాస్ చేస్తున్న విశిష్ట సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం, తిరుపతి జిల్లా టూరిజం-సాంస్కృతిక కౌన్సిల్ తిరుపతి వారి ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం-2025ను ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు, సంయుక్త కార్యదర్శి మమతలకు అదనపు జిల్లా కలెక్టర్, ఏపీ టూరిజం ఈడీ రమణ ప్రసాద్ అందజేశారు. తుడ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో వారు ఈ అవార్డును అందుకున్నారు. పలువురు అభినందించారు.



రాస్ ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి మమతలకు ఉగాది పురస్కారం ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

కూర్మావతారంలో కోదండరాముడు



సూళ్లూరుపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న సీతారాముల ఆలయంలో జరుగుతున్న వసంతనవరాత్రుల వేడుకల్లో భాగంగా సోమవారం కోదండ రాముడు కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో విశేష పూజలు చేశారు. అదే విధంగా బాలాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి వసంతోత్సవాల్లో భాగంగా రెండోరోజు స్వామివారు వామన అవతారంలో దర్శనమిచ్చారు.

అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సురేష్ కుమార్‌రెడ్డి

గూడూరు అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఛైర్మన్‌గా నియమితులైన సురేష్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కాశీ లేఅవుట్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, కోటేశ్వరరావు, మధుసూదన్, నందవరం సుబ్బారావు, శివయ్య, నవీన్‌కుమార్‌రెడ్డి, వినయ్‌కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పదవికి వన్నె తెచ్చేలా కృషి చేస్తాను



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ యాదవ్

తిరుపతి(కల్చరల్), మార్చి 31(ఆంధ్రజ్యోతి): తనకు ఇచ్చిన పదవికి వన్నె తెచ్చేలా, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యాదవులకు మేలు జరిగేలా కృషి చేస్తానని రాష్ట్ర యాదవ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 43 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక పదవుల్లో పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేశానన్నారు. వైసీపీ హయాంలో యాదవ కార్పొరేషన్ సమావేశం నిర్వహించినట్లు రుజువులు లేవని, మినిట్స్ బుక్ కూడా నిర్వహించలేదని అన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి సమావేశం నిర్వహించి, యాదవ కార్పొరేషన్ ద్వారా అందరికీ మేలుచేసే ఆలోచన ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి యాదవుల ఆర్థిక చైతన్యం, తిరుపతిలోని బీసీ భవన్, జగ్జీవన్‌రామ్ భవనం, జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్ కోసం పని చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పుష్పావతి యాదవ్, దంపూరి భాస్కర్ యాదవ్, కట్టా జయరాం యాదవ్, సుబ్బు యాదవ్ పాల్గొన్నారు.

హిందూ ఉద్యోగుల పట్ల వివక్ష తగదు

తిరుపతి(గాంధీరోడ్డు), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పండుగ సెలవుల విషయంలోనూ ఏపీ ప్రభుత్వం హిందూ ఉద్యోగుల పట్ల వివక్ష చూపడం తగదని హిందూ ఉపాధ్యాయసమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ దేగల పేర్కొన్నారు. ఈ విషయంలో ఉద్యోగులు ఎన్ని అభ్యర్థనలు చేసినా స్పందించని ప్రభుత్వం ఇతర మతస్థుల పండుగ సెలవుల విషయంలో మాత్రం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని ఆరోపించారు. దీనికి ఈదుల్ ఫితర్ మరుసటి దినాన్ని ఐచ్ఛిక సెలవుగా ప్రకటించడాన్ని ఉదహరించారు. ఉద్యోగులందరికీ సమన్యాయం వర్తించేలా చర్యలు చేపట్టాలని ఒక ప్రకటనలో కోరారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, మార్చి31(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. శనివారం రూ.3.65 కోట్లు హుండీ ఆదాయం లభించింది. ఆదివారం శ్రీవారిని 62,263 మంది దర్శించుకున్నారు. 25,733 మంది తలనీలాలు సమర్పించారు.